



# విజయభాను

45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, ఆదివారం 26-09-2021 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 45 సంచిక : 14 పేజీలు : 8 వెల : 1 రూపాయి


# రెండేళ్ల పాలనకు నిదర్శనమే ఈ ప్రజా తీర్పు

**- జిల్లా పరిషత్ సభ్యత్వమే రాజకీయాలకు పునాది - సంక్షేమ పథకాల అమలుకు ప్రాదేశిక సభ్యులే కీలకం**



విశాఖపట్నం : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనకు విశాఖపట్నం జిల్లా ప్రజలు బ్రహ్మరథం పట్టారని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా జల్లిపల్లి సుభద్ర తో పాటుగా ఉపాధ్యక్షులు, టి.అప్పారావు, బి.వి.సత్యవతి, కోఆప్షన్ సభ్యులుగా పి.ఎస్.ఎస్.జోసెఫ్, వి.వి.సత్యనారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జిల్లాలో తమ పార్టీకి 37 జెడ్పీటీసీలను అందించిన జిల్లా ప్రజానీకానికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసు కుంటున్నానన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రజల మేలుకోరి వివిధ సంక్షేమం, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. విశాఖ జిల్లాలో మూడు విభిన్న ప్రాంతాలు సిటి ఆఫ్ డెస్టినీ, గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాలు ఉన్నాయన్నారు. మొదటి సారిగా పి.టి.జి. తెగకు చెందిన గిరిజన మహిళకు జెడ్.పి.పి. అధ్యక్షురాలిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రికి జిల్లాప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నట్లు చెప్పారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లలో భాగంగా ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. నూతనంగా ఎన్నికైన జెడ్.పి.టి.సిలు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని, అన్ని తరువాయి 2లో..



## బాధ్యత మరింత పెరిగింది - మంత్రి బొత్స సత్యనారాయణ
## గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి - జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం : జిల్లా ప్రజాపరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవంగా పూర్తయ్యింది. ఛైర్‌పర్సన్‌గా మజ్జి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా మరిశర్ల బాపూజీనాయుడు, అంబటి అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. జిల్లా కలెక్టర్, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి శ్రీమతి ఎ.సూర్యకుమారి అధికారికంగా ఎన్నికల ఫలితాలను ప్రకటించారు. వారి ఎన్నికను ధృవీకరిస్తూ పత్రాలను అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా పరిశీలకులు కాంతిలాల్ దండే, ఈ ఎన్నిక ప్రక్రియను పరిశీలించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి బొత్స సత్యనారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ 7వ పాలకవర్గ ప్రత్యేక సమావేశం శనివారం మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభమయ్యింది. ఇటీవలే వివిధ మండలాలనుంచి తరువాయి 2లో..



శ్రీకాకుళం : జిల్లా పరిషత్ అధ్యక్షులుగా కవిటి జెడ్పీటీసీ పిరియా విజయ ప్రమాణ స్వీకారం చేశారు. నోటిఫికేషన్ ఇచ్చిన మేరకు శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధ్యక్షతన జరిగింది. జెడ్పీటీసీ సభ్యులు కవిటి జెడ్పీటీసీ పిరియా విజయను అధ్యక్షులుగా, సంతకవిటి జెడ్పీటీసీ సిరిపురపు జగన్మోహన రావు, వజ్రపు కొత్తూరు జెడ్పీటీసీ పాలిన శ్రావణిని ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. పిరియా విజయను కంచిలి జెడ్పీటీసీ ఇప్పిలి లోలాక్షి, రేగిడి ఆమదాలవలస జెడ్పీటీసీ పాలవలస ఇందుమతి ప్రతిపాదించగా, ఉపాధ్యక్ష పదవికి సంతకవిటి జెడ్పీటీసీ సిరిపురపు జగన్మోహన రావు పేరును పోలాకి జెడ్పీటీసీ డా. ధర్మాన కృష్ణ చైతన్య, టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణి ప్రతిపాదించగా రెండవ ఉపాధ్యక్ష పదవికి వజ్రపు కొత్తూరు జెడ్పీటీసీ పాలిన శ్రావణి పేరును పాలకొండ జెడ్పీటీసీ గౌరీశ్వరి, జీ.సిగడాం జెడ్పీటీసీ కాయల రమణ ప్రతిపాదించారు.శనివారం ఉదయం ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియలో కో ఆప్షన్ సభ్యులుగా సీతంపేట మండలం రాజన్న గూడ గ్రామానికి చెందిన సవర లక్ష్మి, నరసన్నపేట మండలం నరసన్నపేట పట్టణం బైరాగి తరువాయి 2లో..

## భారత్ అభివృద్ధి చెందితే.. ప్రపంచం కూడా వృద్ధి చెందుతుంది

ప్రధాని నరేంద్ర మోదీ



న్యూయార్క్: న్యూయార్క్ వేదికగా శనివారం సాయంత్రం జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ...భారత్ వృద్ధి చెందితే, ప్రపంచం కూడా వృద్ధి చెందుతుందనే విషయాన్ని నొక్కి చెప్పారు. భారత్‌లో ప్రవేశపెట్టిన సంస్కరణలు ప్రపంచాన్నే మారుస్తున్నాయని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. అన్ని వర్గాలకు సమాన అభివృద్ధి అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ మా నినాదమని చెప్పారు. వ్యక్తి ప్రయోజనం కంటే సమాజ ప్రయోజనమే ముఖ్యమని, దేశంలో 36 కోట్ల మందికి బీమా సౌకర్యం కల్పించామన్నారు.

**మోదీ ప్రసంగంలోని ముఖ్యాంశాలు**

ఏడాది కాలంగా ప్రపంచం సంక్షోభంలో చిక్కుకుంది
మా దేశంలో వైవిధ్యమే ప్రజాస్వామ్యాన్ని బలంగా మార్చింది
వందేళ్లలో ఎప్పుడూ చూడని కరోనా కష్టకాలాన్ని చూశాం
గత ఏడేళ్లలో 43 కోట్ల మందిని తరువాయి 2లో..

## ఇండో-యుఎస్ ద్వైపాక్షిక చర్చలు కొత్త అధ్యాయానికి నాంది

**- ఆరోగ్యశాఖ చరిత్రలోనే 14,200 పోస్టుల భర్తీ అతిపెద్ద రిక్రూట్‌మెంట్ డ్రైవ్**
**- సివిల్స్ సర్వీసులకు ఎంపికైన అభ్యర్థులకు అభినందనలు.**
**- దిశ యాప్ పనితీరుకు చిత్తూరులో జరిగిన ఘటన మరో నిదర్శనం**

**- ఎంపీ (రాజ్యసభ) విజయసాయిరెడ్డి**



విశాఖపట్నం : వైట్ హౌస్‌లో భారత ప్రధాని నరేంద్ర మోడీ,అమెరికా అధ్యక్షుడు జొబైడెన్ ల మధ్య ద్వైపాక్షిక చర్చలు సానుకూలంగా ప్రకటనల ద్వారా ఇండో-యుఎస్ సంబంధాలలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తారని వై.ఎస్.ఆర్ పార్టీ పార్లమెంటరీ నాయకుడు, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి పేర్కొన్నారు పలు అంశాలపై శనివారం విజయసాయిరెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందిచారు. యు.ఎస్.ఎ అభివృద్ధికి భారతీయ ప్రవాసులు తమదైన పాత్ర పోషిస్తున్నారని ఈ మేరకు రెండు దేశాల మధ్య బలమైన స్నేహానికి బాటలు వేశారని వెల్లడించారు. ఈ చర్చలు సఫలీకృతం అవ్వడం వల్ల రెండు దేశాలు వ్యాపార,వాణిజ్యాలు మరింత వృద్ధి చెందుతాయని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెగురుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విద్య, వైద్య రంగాలకు ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆయన వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది కొరతలేకుండా 14,200 పోస్టుల భర్తీకి సీఎం జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చరని,ఇది ఆరోగ్యశాఖ చరిత్రలోనే అతిపెద్ద రిక్రూట్‌మెంట్ డ్రైవ్ గా చెప్పారు. అదే విధంగా నవంబర్15 నాటికి ప్రక్రియ పూర్తిచేయాలన్న సంకల్పం సీఎం జగన్ గారి చిత్తశుద్ధికి నిదర్శనమని కోనియాడారు. ఇటివల సత్తా చాటి ఆల్ ఇండియా సర్వీసులకు ఎంపికైన అభ్యర్థులకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. అత్యంత క్లిష్టమైన ఎంపిక ప్రక్రియలో విజయం సాధించడం మామూలు విషయం కాదని చెప్పారు. మొత్తం 761 సివిల్స్ సర్వీసు పోస్టులలో లో 216 మంది మహిళలు ఉండటం గర్వకారణమని వెల్లడించారు . తెలుగు రాష్ట్రాల నుంచి ర్యాంకులు సాధించిన వారందరికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా దిశ యాప్ పనితీరుకు మరో నిదర్శనం చిత్తూరులో జరిగిన ఘటనాని ఆయన అన్నారు. ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న మహిళపై ఓ అగంతకుడు అఘాయిత్యానికి యత్నించగా, ఆమె ప్రతిఘటించి వెంటనే దిశ యాప్ లో ఎస్.ఓ.ఎస్ బటన్ నొక్కిరని, దీనికి స్పందించిన పోలీసులు 9 నిమిషాల్లోపు అక్కడికి చేరుకొని నిందితుడిని పట్టుకుని బాధితురాలికి రక్షణ కల్పించారని విజయసాయిరెడ్డి వెల్లడించారు.

## ఉత్తరాంధ్రపై తుపాను ప్రభావం..
## ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశం



అమరావతి: తుపాను తీరం దాటాక భారీ వర్షాలకు ఆస్కారం ఉన్నందున.. తీర ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సీఎం జగన్ ఆదేశించారు. తుపాను పరిస్థితులపై సీఎం ఆరా తీశారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది సేవలు వినియోగించుకోవాలని సూచించారు. సీఎం ఆదేశాల మేరకు సచివాలయాల వారీగా అధికారులు కంట్రోల్ తరువాయి 2లో..






## 'గులాబ్' తుఫాన్ దృష్ట్యా జాగ్రత్తలు పాటించండి

**- జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి.సృజన**



విశాఖపట్నం :- బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫానుగా మారి నందున నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన ఒక ప్రకటనలో తెలిపారు. గంటకు 45 కిలోమీటర్ల నుండి 90 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, తీరం వెంబడి నివసించేవారు జాగ్రత్తలు తీసుకోవాలని, సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, విద్యుత్తు స్తంభాలు, హోర్డింగులు, చెట్లు కొమ్మలు విరిగే అవకాశం ఉన్నందున వాటి కింద ఎవరూ ఉండరాదని, ప్రహరీ గోడలు కూలి ప్రమాదం ఉందని, కొండవాలు ప్రాంత ప్రజలు, పాత భవనాలలో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ ప్రకటనలు ఎప్పటి కప్పుడు వినాలని, కాలువలు, గెడ్డలు పొంగే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, కరెంటు పోయే అవకాశం ఉన్నందున టార్చ్ లైట్ లు సిద్ధం చేసుకొని ఉంచుకోవాలని, ఎటువంటి విపత్తులు సంభవించినను జివిఎంసి హెల్ప్ లైన్ నెంబర్ 1800 425 00009, 0891-2869106కు ఫోన్ చేయాలని, అందరూ COVID-19 నిబంధనలు పాటించి, మాస్కులు ధరించి, సామాజిక దూరం పాటించాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "గులాబ్" తుఫాన్ దృష్ట్యా జివిఎంసి ఇంజినీరింగ్ విభాగం, ఉద్యాన విభాగం, ప్రజారోగ్యపు విభాగం అధికారుల నుండి సిబ్బంది వరకు ఎటువంటి సెలవు పెట్టకుండా రాబోవు రెండు రోజులు నగరంలో అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ ఉన్నతాధికారులను ఆదేశించారు.

# డిప్యూటీ సీఎం తనయుడు జడ్పీటీసీ గా విజయం



నరసన్నపేట : ఆంధ్ర ప్రదేశ్ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ తనయుడు, నరసన్నపేట నియోజకవర్గ యువ నాయకుడు, ఇటీవల పోలాకి జడ్పిటిసి గా ఘన విజయం సాధించిన డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య ని మబుగాం క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న విశాఖపట్నం పార్లమెంటు లీగల్ సెల్ అధ్యక్షుడు కరణం కృష్ణ.



*విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ గా ఎన్నికైన మజ్జి శ్రీనివాసరావుని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసిన వైఎస్ఆర్ సిపి రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాధం మరియు ఎమ్మెల్యే గుడివాడ అమర్నాథ్*

## సామాజిక సేవ కు జాతీయ సేవా పథకం 'వేదిక'

**జిల్లా ప్రోగ్రాం అధికారిణి ఇ.వి.యస్ భాగ్యలక్ష్మీ**



గాజువాక : సామాజిక సేవకు జాతీయ సేవా పథకం వేదిక అని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారిణి ఇ.వి.యస్ భాగ్యలక్ష్మీ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల లో జాతీయ సేవా పథకం దినోత్సవ సందర్భంగా భాగ్యలక్ష్మి వలంటీర్లతో మాట్లాడుతూ... ఈ సంవత్సరం విశాఖపట్నం ఆంధ్రయునివర్శిటీలో ఎం.ఎ. ద్వితీయ సంవత్సరం చదువు తన ధనియాల సాయి అనే వలంటీ- సేవా కార్య క్రమాలలో అద్భుత ప్రతిభ చూపి , రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును పొందడం గర్వించదగ్గ విషయమని అన్నారు. ఆంధ్ర, తెలంగాణలో ఒక్క సాయికి మాత్రమే అవార్డు రావడం విశాఖ జిల్లా గర్వించదగ్గ విషయమని అన్నారు. ఈ సందర్భంగా తనను ఆంధ్ర యూనివర్శిటీ లో సన్మానించిన ఆంధ్ర విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి కృష్ణమోహన్ , ఆంధ్ర యూనివర్సిటీ జాతీయ సేవా . పథకం కో-ఆర్డినేటర్ డా. ఎస్. హరనాద్ కు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. యూనిసెఫ్ ప్రోజెక్ట్ ను అందించి, విశాఖ జిల్లాలో జాతీయ సేవా పథకాన్ని బలోపేతం చేసిన యూనిసెఫ్ కన్సల్టెంట్ యు. కిషోర్ కుమార్ కు ధన్య వాదాలు తెలిపారు. వలంటీర్లు, ప్రోగ్రాం అధి కారులు ఇదే స్ఫూర్తి తో కార్యక్రమాలు కొన సాగించాలని కోరారు. కార్యక్రములో వై. అనసూయ, వలంటీర్లు అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఘనంగా సత్యదేవుని ప్రాకార సేవ

అన్నవరం : తూర్పు గోదావరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో శనివారం శ్రీ సత్యదేవుని ప్రాకార సేవ వైభవంగా నిర్వహించారు.

ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు కోట.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీ స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకముల సుగంధభరితమైన పుష్పములతో అలంకరించి వెండి తిరుచ్చి వాహనంపై ఆశీనులు గావించి వేదపండితుల మంత్రోచ్చరణ,మంగళ,వాయిద్యాల నడుమ తూర్పు రాజగోపురం చుట్టూ కోవిడ్ నిబంధనలను పాటిస్తూ అతి కొద్ది మంది సిబ్బందితో ముమ్మారు ప్రదక్షిణ గావించారు.

# రాంజీ ఎస్టేట్ పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలి

*- గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో 48వ వార్డు కార్పొరేటర్ కవిత అప్పారావు*



కంచరపాలెం : గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో కార్యక్రమం అనంతరం 48 వ వార్డు కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు రాంజీఎస్టేట్ లో గల పాఠశాలను పరిశీలించడం జరిగింది . 48వ వార్డు కొండ వాలు ప్రాంతాల విద్యార్థులకు అనుకూలంగా ఉన్న రాంజీఎస్టేట్ ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాల అప్గ్రేడ్ చేయాలని ఇటీవల జరిగిన జీవిఎంసి కౌన్సిల్ లో చెప్పడం జరిగింది. ఈమేరకు జీవిఎంసీ నుండి లిఖిత పూర్వకంగా పత్రం అందిందని త్వరలో అధికారులు వచ్చి పరిశీలిస్తారని తెలియజేసారు. పాఠశాల లో పదహారు గదులు ఉన్నాయని అవసరం అయితే కొత్త గా భవనం నిర్మాణానికి ఖాళీ స్థలం కూడా ఉందని తెలిపారు.ఆరు వార్డు ల విద్యార్థులకు దగ్గర గా ఉన్న పాఠశాల ఇదే అని ఆరు నుండి పదవ తరగతి వరకు చదవాలంటే జాతీయ రహదారి దాటి వెళ్ళాల్సి వస్తుంది లేకపోతే ప్రైవేటు పాఠశాలలే దిక్కుఅవుతున్నాయని,రెక్కడితేనె గాని డొక్కాడని కుటుంబాలు కొండ వాలు ప్రాంతాల వారు అని వారి పిల్లల భవిష్యత్తు కోసం పాఠశాల అప్ గ్రేడ్ చేయడం జరుగుతుంది అని అప్ గ్రేడ్ జరిగితే వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తు కు పూల బాట వేసినట్లు అని తెలియజెసారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ కోర్ కమిటీ సభ్యులు గంకల అప్పారావు,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# కీ.శే. శీరం నరేంద్ర వర్మ కు ఘన నివాళులు



ములగాడ: తెదేపా సీనియర్ నాయకులు దివంగత నేత శీరం పైడ్రాజు కుమారుడు కీర్తిశేషులు శీరం నరేంద్ర వర్మ పెద్దకర్మ పారిశ్రామిక ప్రాంతం జీవీఎంసీ 58 వ వార్డు శ్రీహరిపురం లో కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు పశ్చిమ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీరం నరేంద్ర వర్మ మరణం కుటుంబ సభ్యులకు, తెదేపా కు తీరని లోటని అన్నారు. నరేంద్ర వర్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా నగర తెదేపా ప్రతినిధి కాకి పోలిరెడ్డి, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంత్రి ఆశీస్సులు పొందిన గొలుగొండ జడ్పీటీసీ గిరిబాబు



విశాఖపట్నం జిల్లా (నర్సీపట్నం) : నియోజకవర్గంలోని గొలుగొండ మండలం జడ్పిటిసి గా ఎన్నిక కాబడిన సుర్ల వెంకట గిరి బాబు శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్ రావు ఆశీస్సులు పొందారు. ప్రత్యేకించి నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ మాకవరపాలెం జడ్ పి టి సి గొలుగొండ జెడ్పిటిసి ల తో కలిసి ఫొటో తీయించుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో వెనుకబాటుకు గురైన గొలుగొండ మండలం అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని విలేకరులకు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్, రాష్ట్ర మంత్రి తోపాటు, జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైస్ చైర్మన్ లు సహాయ సహకారాలతో మండలాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు.

దీంతోపాటు గొలుగొండ మండలం నుండి ఆయనతో ర్యాలీగా మండల వైస్ ఎంపీపీ బాబ్జి, సర్పంచులు పోలిరెడ్డి రాజబాబు, సిహెచ్ నాగ పురం సర్పంచ్, మిగతా ప్రాంతాల నుండి ఎంపిటిసి గా గెలిచిన వారు, వివిధ గ్రామాల్లోని సర్పంచులు ఆయనకు మద్దతుగా జిల్లా పరిషత్ కు వచ్చి ఘనంగా సన్మానం చేశారు.



మొదటి పేజీ తరువాయి

## బాధ్యత మరింత పెరిగింది - మంత్రి బొత్స సత్యనారాయణ

నూతనంగా ఎన్నికైన జిల్లాపరిషత్ ప్రాదేశిక సభ్యులచేత ముందుగా కలెక్టర్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక జరిగింది. అంతకుముందే నామినేషన్ ప్రక్రియను పూర్తిచేసి, అర్హత సాధించిన షేక్ దర్గా(భోగాపురం), షేక్ నిషార్(కురుపాం)ను కో-ఆప్టెడ్ సభ్యులుగా ఎన్నికైనట్లు కలెక్టర్ ప్రకటించారు. వారిచేత కూడా ప్రమాణస్వీకారం చేయించిన అనంతరం సమావేశం ముగిసింది. ఛైర్‌పర్సన్ ఎన్నిక కోసం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం ప్రారంభమయ్యింది. మెరకముడిదాం మండలం నుంచి జెడ్‌పిటిసి సభ్యునిగా ఎన్నికైన మజ్జి శ్రీనివాసరావు పేరును ఛైర్మన్ అభ్యర్థిగా, జియ్యమ్మవలస మండలం జెడ్‌పిటిసి సభ్యులు మూడడ్ల శశికళ ప్రతిపాదించారు. అతని పేరును బొబ్బిలి జెడ్‌పిటిసి సభ్యులు సంకిలి శాంతకుమారి బలపరిచారు. అనంతరం చేతులెత్తే పద్దతిలో ఓటింగ్ నిర్వహించగా, మొత్తం 34 మంది జెడ్‌పిటిసి సభ్యులు మద్దతుతో, మజ్జి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కలెక్టర్ సూర్యకుమారి ప్రకటించారు. ఉపాధ్యక్ష పదవికి గరుగుబిల్లి మండల జెడ్పిటిసి మరిశర్ల బాపూజీనాయుడి పేరును, గజపతినగరం జెడ్పిటిసి గార తవుడు ప్రతిపాదించగా, ఎల్.కోట జెడ్పిటిసి తూర్పాటి వరలక్ష్మి బలపరిచారు. మరో ఉపాధ్యక్షునిగా సాలూరు జెడ్పిటిసి అంబటి అనిల్‌కుమార్ పేరును, నెల్లిమర్ల జెడ్‌పిటిసి సభ్యులు గదుల సన్యాసినాయుడు ప్రతిపాదించగా, జామి జెడ్‌పిటిసి సభ్యులు గొర్లె సరయు బలపరిచారు. వేర్వేరుగా జరిగిన ఓటింగ్ లో ఇద్దరికీ 34 మంది మద్దతు ప్రకటించడంతో, వీరిరువురు కూడా ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కలెక్టర్ ప్రకటించారు.

**జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి : కలెక్టర్ సూర్యకుమారి**

జిల్లా ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన మజ్జి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన మరిశర్ల బాపూజీనాయుడు, అంబటి అనిల్‌కుమార్ ను, జిల్లా కలెక్టర్ వేదికపైకి ఆహ్వానించి, వారికి అభినందనలు తెలిపారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పథకాలను ముందుకు తీసుకువెళ్లాలని, జిల్లా అభివృద్దికి సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. ఈ ప్రత్యేక సమావేశానికి ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి, మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, శాసన సభ్యులు శంబంగి వెంకట చినప్పలనాయుడు, కోలగట్ల వీరభద్రస్వామి, పీడిక రాజన్నదొర, బడ్డుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, అలజంగి జోగారావు, కడుబండి శ్రీనివాసరావు హాజరయ్యారు.

**రెండేళ్ల పాలనపై ప్రజా తీర్పు : మంత్రి బొత్స సత్యనారాయణ**

ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అఖండ విజయాన్ని చేకూర్చడంతో, తమ బాధ్యత మరింత పెరిగిందని రాష్ట్ర పురపాలక శాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. జెడ్‌పి ఎన్నిక అనంతరం, ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల ఫలితాలను తమ ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలిచ్చిన తీర్పుగా పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాపరిషత్ పీఠాలను తమ పార్టీ కైవసం చేసుకుందని, ఇది తమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి పాలనాదక్షతకు, సమర్థతకు నిదర్శనమని చెప్పారు. ముఖ్యమంత్రి సలహాలు, సూచనలతో, ఎన్నికలను ఒక సవాల్ గా తీసుకున్నామని, గతంలో ఎన్నడూ లేని రీతిలో జిల్లాలోని మొత్తం 34 జెడ్‌పిటిసి స్థానాలనూ గెలుచుకోవడం ద్వారా, కొత్త చరిత్రను సృష్టించామని అన్నారు. మరింత బాధ్యతాయుతంగా పనిచేసి, తమపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, ముఖ్యమంత్రి ఆశయ సాధనకు కృషి చేస్తామని మంత్రి అన్నారు.

**గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువస్తాం : జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు**

మారుమూల ప్రాంతాల్లో అన్నిరకాల మౌలిక వసతులను కల్పించడంతోపాటుగా, గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఛైర్మన్‌గా ఎన్నికైన అనంతరం ఆయన మీడియాతో ఉద్వేగభరితంగా మాట్లాడారు. ఒక సామాన్య కార్యకర్తగా ఉన్న తనను జెడ్‌పి ఛైర్మన్‌గా చేసినందుకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డికి సర్వదా కృతజ్ఞుడినై ఉంటానని ప్రకటించారు. తన గెలుపునకు సహకరించిన జిల్లా మంత్రులకు, ప్రజాప్రతినిధులకు, జెడ్‌పిటిసి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, జెడ్‌పిటిసిలను సమన్వం చేసుకుంటూ, వారి సూచనలకు అనుగుణంగా ముందుకు వెళ్తానన్నారు. సిఎం ఆదేశాలకు అనుగుణంగా, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేస్తానని చెప్పారు. తనకు పెద్దపదవి వచ్చినప్పటికీ, ఎప్పటి చిన్నశ్రీను లాగే, సామాన్య కార్యకర్తలకు నిత్యం అందుబాటులోనే ఉంటానని ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రకటించారు.

## రెండేళ్ల పాలనకు నిదర్శనమే ఈ ప్రజా తీర్పు

రంగాలలో జిల్లాను అగ్రపథంలో నడిపించాలన్నారు. ప్రభుత్వ విప్ బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజా రంజకపాలనకు నిదర్శనంగా రాష్ట్రంలో మొత్తం 13 జిల్లా పరిషత్ లు తమపార్టీ ఖాతాలోనే చేరాయన్నారు. మెజార్టీని బాధ్యతగా భావించి మరింత కృషి చేయాలన్నారు. గెలిచిన చైర్ పర్సన్, సభ్యులు ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలందరికీ చేరేలా పని చేయాలన్నారు. జెడ్ పి చైర్ పర్సన్ గా ఎన్నికైన సుభద్ర మాట్లాడుతూ తనకు అత్యున్నత పదవినిచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. తనకిచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకుని పేదలందరికీ పథకాలు అందేందుకు కృషి చేస్తానని చెప్పారు. గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడతానన్నారు.

ఈ సమావేశంలో పార్లమెంటు సభ్యురాలు జి.మాధవి, శాసన సభ్యులు యు.వి.సూర్యనారాయణరాజు, జి.అమర్ నాథ్, కరణం ధర్మశ్రీ, కె.భాగ్యలక్ష్మి, శెట్టి ఫల్గుణ, పెట్ల ఉమాశంకర్ గణేష్, అదీప్ రాజ్, గొల్లబాబూరావు తదితరులు పాల్గొన్నారు.

---

వీధికి చెందిన షేక్ బాబ్జి నామినేషన్లు దాఖలు చేశారు. ఇతరులు ఎవరు నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులతో జిల్లా పరిషత్ సిఈఓ బి.లక్ష్మీపతి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల పరిశీలకులు కె.ఆర్.బి.హెచ్.ఎన్. చక్రవర్తి హాజరయ్యారు. జిల్లాలో 38 జెడ్పీటీసీ స్థానాలకు గాను హిరమండలంలో ఎన్నికలలో టిడిపికి చెందిన అభ్యర్థి మృతి చెందడంతో అచ్చట ఎన్నికను వాయిదా వేసారు. ఈ నెల 19 వ తేదీన జరిగిన లెక్కింపులో 37 మండలాల్లోనూ వైఎస్సార్ సిపి అభ్యర్థులు గెలుపొందారు. దీంతో అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, కళింగ వైద్య, తూర్పు కాపు కార్పొరేషన్ల అధ్యక్షులు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, శాసన మండలి సభ్యులు దువ్వాడ శ్రీనివాస్, శాసనసభ్యులు కంబాల జోగులు, గొర్లే కిరణ్ కుమార్, విస్వసరాయి కళావతి, రెడ్డి శాంతి, కేంద్ర మాజీ మంత్రి డా. కిల్లి కృపారాణి, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు , శాసనసభ్యులు తదితరులు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన అభ్యర్థులను అభినందించారు.

**ఉత్తరాంధ్రపై తుపాను ప్రభావం.. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశం**

రూమ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఉత్తరాంధ్రలో విపత్తు నిర్వహణ సిబ్బందిని సిద్ధం చేశామని అధికారులు సీఎంకు వివరించారు. ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చర్యలు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. బంగాళాఖాతంలో శుక్రవారం ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారింది. ఉత్తర, తూర్పు మధ్య బంగాళాఖాతంలో గోపాల్‌పూర్‌కి 510 కి.మీ తూర్పు ఆగ్నేయ దిశలో.. కళింగపట్నానికి తూర్పు ఈశాన్య దిశలో 590 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. రానున్న 24 గంటల్లో ఇది మరింత బలపడి తుపానుగా మారే అవకాశముంది. ఈ తుపాను గంటకు 12 కి.మీ వేగంతో పశ్చిమ దిశగా కదులుతూ ఉత్తరాంధ్ర- దక్షిణ ఒడిశా తీరంలో రేపు సాయంత్రం తీరం దాటే అవకాశముందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం తెలిపింది. తుపాను తీరం దాటే సమయంలో పూరిళ్లు దెబ్బతినే ప్రమాదముందని అధికారులు అంచనావేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. ఏపీ, ఒడిశాలో 18 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను మోహరించారు. ఉత్తరాంధ్ర, గంజాం, గజపతి జిల్లాల్లో తీవ్ర ప్రభావం ఉంటుందని ఐఎండీ తెలిపింది.

**భారత్ అభివృద్ధి చెందితే.. ప్రపంచం కూడా వృద్ధి చెందుతుంది**

బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించాం

కోట్ల మందికి సురక్షిత ఆరోగ్య సదుపాయాలు కల్పించాం
కలుషిత నీరు ప్రపంచం మొత్తానికి పెద్ద సమస్య
17 కోట్ల మందికి సురక్షిత మంచినీటిని అందించగలిగాం
కరోనా సమయంలో 3 కోట్ల మందికి ఇళ్లు కట్టించాం
సమ్మిళిత అభివృద్ధి వైపు భారత్ నడుస్తోంది.
ఎన్ని ఆటంకాలు ఎదురైనా.. వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయగలిగాం
ముక్కుద్వారా ఇచ్చే టీకాను త్వరలో తీసుకొస్తాం
ఎమ్ఆర్ఎన్ఏ టీకా తయారీ చివరి దశలో ఉంది
12 ఏళ్లు దాటిన వారికి ఇచ్చే డీఎన్ఏ టీకాను తయారు చేస్తున్నాం
వందేళ్లలో చూడని విపత్తును కరోనాతో చూశాం
ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలన్నది భారత్ విధానం
భారత్‌లో వేల ఏళ్లుగా ప్రజాస్వామ్యం కొనసాగుతోంది
ప్రజాస్వామ్య పాలనలో అన్ని లక్ష్యాలను చేరుకుంటున్నాం
భారత్ ప్రజాస్వామ్య ప్రకాశానికి ఒక ఉదాహరణ

# పెర్‌ఫెక్టు డెంటల్ క్లినిక్ ప్రారంభోత్సవం



విశాఖపట్నం : డాక్టర్ కె ఎమ్ ప్రవల్లిక చే ద్వారకానగర్ మూడవ లైన్ లో నూతనంగా స్థాపించబడిన దంత వైద్యశాల ను ఎ.రామ్మోహన్ రెడ్డి, ఐఎఫ్ఎస్, జోనల్ డవలప్ మెంట్ కమిషనర్, విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ వారి చేతుల మీదగా ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఈ కార్యక్రమంలో ఎ.రామ్మో హన రెడ్డి డా.కె.ఎమ్ ప్రవల్లిక ను ఆశీర్వదిస్తూ, పేద బడుగు వర్గాలకు సముచితమైన వైద్య సేవలు అందించాలని, ఈ వైద్య వృత్తిలో మంచి నైపుణ్యముతో విజయాలు సాధిస్తూ ప్రగతి పథంలో పయనిస్తూ ఎందరో డాక్టర్లకు మార్గదర్శకం కావాలని శ్రీ రామ్ మోహన్ రెడ్డి డాక్టరు ప్రవల్లిక కు మార్గ దర్శనం చేశారు. ఈ ప్రారంభోత్సవానికి ప్రముఖులు ఆర్‌వి ప్రదమేశ్, ఐఆర్ఎస్ సెంట్రల్ జిఎస్‌టి జాయింటు కమిషనర్, ఎస్.వి.రమణ, మేనేజింగ్ డైరెక్టర్, విశాఖడైరీ, ఓ.ఫణి, డిప్యూటీ డెవలప్‌మొంటు కమిషనర్ మరియు కె.శ్రీనివాస్, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమీషనర్, ఆకుల చంద్రశేఖర్, చార్టర్డు ఎకౌంటెంటు, వి పార్ధసారధి, సీనియర్ల న్యాయవాది, పి.ఎల్ కె మూర్తి, పబ్లిక్ రిలేషన్ సొసైటి అద్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

### గ్రేటర్ విశాఖ నాయి బ్రాహ్మణ సేవా సంఘం

# వైస్ ప్రెసిడెంట్‌గా రాయవరపు నానాజీ

## కార్యదర్శిగా ముచ్చు పల్లి వెంకటరమణ

చోడవరం : విశాఖ జిల్లా, గ్రేటర్ విశాఖ నాయి బ్రాహ్మణ సేవా సంఘం వైస్ ప్రెసిడెంట్ గా చోడవరం కి చెందిన ప్రముఖ నాదస్వర విద్వాంసులు రాయవరపు నానాజీ, సంఘ కార్యదర్శిగా చోడవరం మండలం అంబేరుపురం గ్రామానికి చెందిన ప్రముఖ క్లారినెట్, సాక్సోఫోన్ విద్వాంసులు ముచ్చు పల్లి వెంకటరమణ నియామకమైన ట్లు శనివారం తెలిపారు.

విశాఖపట్నం, ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో...

ఈ మేరకు నియామకం చేయడం జరిగిందని విశాఖ జిల్లా, గ్రేటర్ విశాఖ నాయి బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి ఉప్పలపు శ్రీనివాసరావు( నక్కపల్లి) ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వారిని అభినందించారు.



రాయవరపు నానాజీ



ముచ్చుపల్లి వెంకటరమణ

# జేఎన్‌టి ఫిజియోథెరపీ పోలి క్లినిక్ ప్రారంభం



విశాఖపట్నం : గ్రేటర్ విశాఖలో వైద్యరంగం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జేఎన్‌టి ఫిజియోథెరపీ పోలిక్లినిక్ వంటివి సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయ మని విశాఖ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి కొనియాడారు. డైమండ్ పార్కు జంక్షన్ దగ్గర ఉన్న భువనేశ్వరి ప్లాజా వద్ద శనివారం ఈ క్లినిక్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తో పాటు మేయర్ హరి వెంకట కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు మంచి నాణ్యమైన సేవలు తక్కువ ధరకు అందించాలని యాజమాన్యాన్ని కోరారు. వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ నళిని సారథ్యంలో ఏర్పాటుచేసిన ఫిజియోథెరపీ క్లినిక్ విలువైన సేవలు అందించి మంచి పేరు ప్రఖ్యాతలు రావాలని ఆకాంక్షించారు. క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ నళిని మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో వైద్యం పట్ల అసంతృప్తితో ఉన్న ప్రజలకు అందుబాటు ధరలోనే ఫిజియోథెరపీ, అర్థో వైద్యంతో పాటు సాధారణమైన బీపీ షుగర్ థైరాయిడ్ వంటి చికిత్స కూడా అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆళ్ల లీలావతి,వైసీపీ నాయకుడు నీలపు సర్వేశ్వర రెడ్డి, సిబ్బంది త్రినాధ రావు,అవినాష్,రేఖ జైన్ తదితరులు పాల్గొన్నారు.

### క్రిష్ణ ప్రదీప్ 21 ఫస్ట్ సెంచరీ ఐఏఎస్ ఆధ్వర్యంలో

# సివిల్ సర్వీసెస్ పరీక్షలపై అవగాహన కార్యక్రమం

విశాఖపట్నం : రెండు తెలుగు రాష్ట్రాలలో ఎంతో మంది సివిల్ సర్వేట్లను అందించిన క్రిష్ణ ప్రదీప్ 21 ఫస్ట్ సెంచరీ ఐ ఏ ఎస్ ఆధ్వర్యంలో ఐఏఎస్ పరీక్షకు సిద్ధం అయ్యే విద్యార్థులకు నగరంలోని రామచంద్ర వేదిక హాల్లో ఉచిత అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంస్థ చైర్మన్ క్రిష్ణ ప్రదీప్ సివిల్ సర్వీస్ పరీక్ష పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భగా చైర్మన్ క్రిష్ణ ప్రదీప్ మాట్లాడుతూ తమ సంస్థ లో శిక్షణ పొందినవారు వివిధ స్థాయిలో స్థిరపడ్డారు అని తెలియజేసారు. సివిల్ సర్వీసెస్ పరీక్షకు సిద్ధం అయ్యేవారు మొదట నుంచి ప్రాణాళికాబద్ధం గా చదివితే సులువుగా పరీక్ష లో ఉత్తీర్ణత సాధించవచ్చు అని అన్నారు. పరిక్షాలకు సిద్ధం అయ్యేవారు రైట్, రీడ్ , రివైజ్ లను పాటిస్తే విజయం తప్పక వస్తుంది అని అన్నారు. తమ సంస్థ లో విద్యార్థులకు ఇంటర్ తో పాటు సివిల్ సర్వీసెస్ శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేకించి ఇంటిగ్రేటెడ్ కోర్స్ అందిస్తున్నాం అని అన్నారు.ఈ అవగాహన కార్యక్రమం లో సంస్థ ప్రతినిధులు,అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఐ.విజయ్ బాబు శనివారం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ పివిజిడి. ప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు గైడ్‌షిప్ ఇచ్చినందుకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ కె.బి.కె నాయక్, డాక్టర్ సి.హెచ్.వి.యం.కె. హరి మరియు ఉద్యోగ సంఘ నాయకులు డాక్టర్ సి.హెచ్.విష్ణుమూర్తి, డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వంగవీటి రాధాకృష్ణ ని కలిసిన టీడీపీ నాయకులు

సింహాచలం : విజయవాడ జననేత కాపుల అంబేడ్కర్ ఎమ్మెల్యే లేట్ వంగవీటి మోహన్ రంగా తనయుడు విజయవాడ బెబ్బులి వంగవీటి రాధాకృష్ణ ని శుక్రవారం నాడు విజయవాడ ఆఫీసు లో 98వ వార్డు టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా డిసెంబరులో జరగనున్న మోహన్ రంగా జయంతికి ఆయనను ఆహ్వానించారు అనంతరం బీఆర్‌టిఎస్ రోడ్ విస్తరణలో రంగా విగ్రహం తొలగిస్తే ప్రత్యామ్నయంగా మరో చోట స్థలం కేటాయించాలని కోరారు ఈ కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ జనరల్ సెక్రటరీ పాశర్ల ప్రసాద్ విశాఖ టీడీపీ స్పొక్స్ పర్సన్ సతివాడ శంకర్ రావు పైడికొండ లండరాంబాబు వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



### స్వర్గీయ లోకుల గాంధీ కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా

# పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ పుట్టినరోజు వేడుకలు



విశాఖపట్నం : భారతీయ జనతా పార్టీ సిద్ధాంత కర్త, భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ మాజీ అధ్యక్షులు పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ పుట్టిన రోజు సందర్భంగా శనివారం శరభన్న పాలెంలో స్వర్గీయ లోకుల గాంధీ కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించడం జరిగింది. మరియు రావిమానుపాలెం గ్రామంలో ఆదివాసీలు కూడా బీజేపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ అర్జున్ రెడ్డి సమక్షంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ జన్మ దినాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ జన్మదిన కార్య క్రమంలో బిజెపి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మరియు సమాచార హక్కు చట్టం సభ్యులు అర్జున్ రెడ్డి, బిజెపి యువ మోర్చా అధ్యక్షులు లోకుల జీవన్ కిషోర్, సంపరి శివ కుమార్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# నిత్య అన్నదానానికి రూ.2 లక్షల విరాళం

సింహాచలం : శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యన్నదాన పథకానికి ధవళేశ్వంకు చెందిన కోట. ఆంజనేయశర్మ రెండు లక్షల రెండు వందల ముప్పై రెండు రూపాయలు 2లక్షల232విరాళం ఇచ్చారు. దీనికి సంబంధించి రెండు లక్షా నూట పదహారు రూపాయలు చొప్పున రెండు బాండ్లు రిసీప్టులను పీఆర్వో ఆఫీసులోని డొనేషన్ల కౌంటర్లో స్వీకరిం చారు. తాను సోలార్ ఎనర్జీ రంగంలో ప్రయోగాలు చేసి దాన్ని సామాన్యుడికి చేర్చడంలో విజయం సాధించానని... స్వామివారి ఆశస్సులతోనే అది సాధ్యమైందని చెప్పారు వీరికి దేవస్థానం అధికారులు స్వామి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



### లెజెండరీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మొదటి వర్ధంతి సందర్భంగా

# ఎస్పీ బాలు అభిమాన సంఘం ఆధ్వర్యంలో అభిమానులు ఘన నివాళులు

**శ్రోతల హృదయాలను దోచుకున్న గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిరస్థాయిగా అభిమానుల గుండెల్లో నిలిచిపోతారు**

**వైసీపీ యువనాయకుడు ద్రోణంరాజు శ్రీవాత్సవ**

విశాఖపట్నం : అర్ధ శతాబ్దానికి పైగా భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా శ్రోతల హృదయాలను దోచుకున్న గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తో చిరస్థాయిగా అభిమానుల గుండెల్లో నిలిచిపోతారని వైసీపీ యువనాయకుడు ద్రోణంరాజు శ్రీవాత్సవ అన్నారు. లెజెండరీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మొదటి వర్ధంతి సందర్భంగా విశాఖపట్నం ఎస్పీ బాలు అభిమాన సంఘం ఆధ్వర్యంలో ద్వారకానగర్ లో అభిమానులు ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి శ్రీవాత్సవ హాజరై బాలు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గాయకుని గా, సంగీత స్వరకర్త గా మరియు నటుడుగా ఎంతోమంది కి అభిమానపాత్రుడైన బాలు గత సంవత్సరం ఈ రోజున కరోనావైరస్ కారణంగా మరణించడం దురదృష్టమన్నారు.తమ కుటుంబానికి ఆత్మీయుడని,అయన మరణించినట్లు గానే తన తండ్రి ద్రోణంరాజు శ్రీనివాస్ కూడా కరోనాతో మృతిచెందడాన్ని ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతు న్నానన్నారు. బాలు తన గాత్రం తో అన్ని భావోద్వేగాలను పలికించేవారని కొనియాడారు. అభిమానుల కోరిక మేరకు బీచ్ రోడ్ లో ఎస్పీ బాలు విగ్రహ ప్రతిష్టకు తీవ్రంగా కృషిచేస్తానని శ్రీవాత్సవ హామీ ఇచ్చారు. శర్మ ఆప్టికల్స్ అధినేత అద్దంకి శ్రీనివాస్ మాట్లాడుతూ బాలు తో తనకున్న పరిచయాన్ని గుర్తుచేసుకుని కన్నీటిపర్యంతమయ్యారు.అత్యంత ఆత్మీయంగా తనను పలకరించే అయన మరణం వ్యక్తిగతంగా అయన మరణం తననెంతో కృంగదీసిందన్నారు.విశాఖ వచ్చినప్పుడల్లా తమ షాపుకు వచ్చి కళ్లజోళ్లను ఎంపికచేసుకునేవారన్నారు. తెలుగు లో మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఎన్నోభాషల్లో పాటలను పాడి కోట్లాది అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అనంతరం దాదాపు 150 పేదవారికి అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాగోటీ వెంకీ,పూడిపెద్ది సాయి,కబాడీ శ్రీను,వీ.మురళీకృష్ణ,ఆనంద్,డీ.దేముడు బాబు,శ్రీకాంత్ ప్రసాద్,వనమా శ్రీనివాస్ లు పాల్గొని గానగంధర్వునికి నివాళులు అర్పించారు.



### వరి పంటలో కాలిబాట వేసుకోవడం వల్ల

# సుడి దోమను అరికట్టవచ్చు



అడ్డూరు లో స్థానిక రైతులకు అవగాహన కల్పిస్తున్న నైరా కళాశాల విద్యార్థులు

చోడవరం : మండలంలోని అడ్డూరు గ్రామంలో గత కొద్ది రోజులుగా నైరా కళాశాల విద్యార్థులు స్థానిక రైతులకు వరి పంట లో తీసుకోవాల్సిన సస్యరక్షణ పనులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం వరి పంటలో కాలిబాట వేసుకోవడం వలన సుడి దోమ నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వరి పంటలో కాలిబాట వలన సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు వీలుగా ఉంటుందని, పంట అధిక లాభాలు పొందేందుకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులకు వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వరరావు సూచన మేరకు నైరా కళాశాల విద్యార్థులు ఫిరోజ్, జయ ప్రకాష్, కళ్యాణ్ చక్రవర్తి, కార్తీక్, రైతు భరోసా కేంద్రం వి హెచ్ ఎ శ్రీనివాస్, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### పెనుసవాలుగా పర్యావరణం

వ్యవసాయం-పర్యావరణ యూనిట్‌గా స్థానిక సాంకేతిక పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆహార, పోషక వ్యవస్థల్లో నష్టాలను నివారించాలి. పంటల మార్పిడి, జీవ సేంద్రియ ఎరువులు, జీవ నియంత్రణ పద్ధతులు, పర్యావరణ వ్యవస్థతో ఇమిడ్చి, ఆధునికతను జోడించడం ద్వారా వ్యవసాయాన్ని సుస్థిరపరుచాలి. భూమి ఆరోగ్య పరిరక్షణ, నీటి సంరక్షణ, భూసారం పెంపొందింపు, నేల కోతను నివారించటం ద్వారా ఉత్పాదకతను పెంచడం దీర్ఘకాలిక లక్ష్యంగా ఎంచుకోవాలి. పర్యావరణ మార్పులను ఎదుర్కొనేందుకు కేవలం భారత్ అనుకుంటేనే కాదు, స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సమగ్ర కార్యాచరణ అవసరం. కోపెన్ హెగెన్ సదస్సులో నిర్ణయించినట్లుగా ఉద్గారాలను తగ్గించటం ద్వారా ఉష్ణోగ్రత పెరుగకుండా భారత్ కృషిచేయాలి. పర్యావరణ మార్పులకు అనుకూల విధానాలను రూపొందించుకుంటూనే, అభివృద్ధి చెందిన దేశాలు కార్బన్ ఉద్గారాల విడుదలకు మూల్యం చెల్లించేవిధంగా ఒత్తిడి తెస్తేనే పర్యావరణం పరిరక్షించబడుతుంది. పర్యావరణ మార్పులు వ్యవసాయంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఫలితంగా ఆహారభద్రతపై నీలినీడలు అలుముకున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పటికే యుద్ధ ప్రాతిపదికన హరితహారంతో మొక్కలు వనాల పెంపకం చేపట్టింది. అనావృష్టిని ఎదుర్కొనేందుకు చెరువుల పునరుద్ధరణ దాదా పు పూర్తయ్యింది. పంటల వైవిధ్యీకరణకు బాటలువేసింది. దీంతో పర్యావరణ మార్పు లు విపరీతంగా చోటు చేసుకున్న ప్పటికీ, సాగును సజావు గా సాగించేందుకు సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తున్నది. ఒక్క మాట లో చెప్పాలంటే, పర్యావరణ మార్పులను తట్టుకునేందుకు, తెలంగాణ ప్రభుత్వం ముందస్తుగానే తయారైందని తెలుస్తున్నది. వాతావరణ మార్పులతో అభివృద్ధి దేశాల్లో ఆహారధా న్యాల ఉత్పత్తి తరిగిపోతున్నది. మరో రెండు సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత పెరిగి తే దేశంలో ప్రధాన ఆహారపంట వరి ఉత్పాదకత హెక్టారుకు ఒక టన్ను తగ్గిపోనున్నది. 2050 నాటికీ ఒక్క డిగ్రీ ఉష్ణోగ్రత పెరిగినా, దేశంలో మరో ప్రధాన ఆహారపంట గోధుమ ఉత్పాదకత తగ్గిపోతుంది. సాగుకు అనుకూల భూమి తగ్గిపోనున్నది. ప్రస్తుతం సాగు చేస్తున్న పంటరకాలు సాగుకు పనికిరావు. ఏడాదికి ఒక్క మన దేశంలోనే దాదాపు 70 లక్షల టన్నుల మేర ఉత్పత్తి పడిపోనున్నది. దీనికితోడు ఆకస్మిక వరదలు, వర్షాల లేమి సంభవించనున్నాయి. 2009లో సంభవించిన అననుకూల వర్షాభావ పరిస్థితుల వల్ల, ఒక కోటి 50 లక్షల టన్నుల వరి, 40 లక్షల టన్నుల ఇతర ఉత్పత్తి పడిపోయింది. పర్యావరణ మార్పుల వల్ల, అసాధారణ పరిస్థితులు భారత వ్యవసాయంలో చోటుచేసు కుంటున్నాయి. అసాధారణ వాతావరణ పరిస్థితులున్న దేశాల్లో భారత్ ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉన్నది. ఒక్క 2015లోనే దేశంలో 15 రాష్ట్రాలు వీటి ప్రభావాన పడితే, దాదాపు 33 శాతం పంటల సాగు విస్తీర్ణం దెబ్బతిన్న ది. ఇరువై వేల కోట్ల రూపాయల పైనే రైతులు నష్టపోయారు. పంటల బీమా లాంటి పథకాలతో ఆదుకుంటే తప్ప, రైతు సాగులో నిలబడలేరని భారత హరితవిప్లవ పితామహులు స్వామినాథన్ గుర్తుచేయాల్సి వచ్చిం ది. ఇది దేశ ఆహారభద్రతకు ప్రత్యక్ష హెచ్చరిక. ఎంత త్వరగా పరిష్కారం వెతికితే, అంత త్వరగా దేశం, ఆహార భవిష్యత్తు భద్రంగా ఉంటుంది. తెలుగు రాష్ట్రాలకు మరిన్ని పర్యావరణ సవాళ్లు పొంచి ఉన్నట్లు ప్రపం చబ్యాంకు షాక్ వేవ్స్' నివేదిక తెలుపుతున్నది. పర్యావరణ మార్పుల ప్రభావాన్ని గత 25 ఏండ్లలో అధ్యయనంలో 14 శాతం ప్రజలు పేదరి కం నుంచి బయటపడితే, ఏడాదికి సరాసరిన 12 శాతం ప్రజలు మళ్లీ పేదరికంలోకి నెట్టివేయ బడుతున్నారు. ఎండల తీవ్రత, వర్షాల లేమి వల్ల, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గత 25 ఏండ్లలో 15 వేల మందికి పైగా పేదలు చనిపోయారు. ప్రపంచంలో సూడాన్ దేశం తర్వాత, అత్యధిక మరణాలు జరిగినయి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే. 2030 నాటికీ ఐదు శాతం మేర ఆహారధాన్యాల ఉత్పత్తి పడిపోతుంది. దీంతో పేదరికం పెరుగనున్నది. 2030 నాటికీ పేదరిక నిర్మూలన చర్యలు చేపట్టకపోతే, పేదరికం 30 శాతానికి చేరుకోనున్నది. కరువు, నీటికొరత, తద్వారా పంట నష్టాల వల్ల పంటల దిగుబడులు తగ్గి ఆహారకొరత పెరగనున్నదని నివేదిక తెలిపింది.



జలుమూరు మండలం ఎంపీపీ గా బాధ్యతలు స్వీకరించిన వాన గోపి కి మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేస్తున్న విశాఖపట్నం పార్లమెంటరీ లీగల్ సెల్ అధ్యక్షుడు కరణం కృష్ణ మరియు చల్లవానిపేట డి సి సి బి ప్రెసిడెంట్ ఋక్క లక్ష్మణరావు, చల్లవానిపేట ఎంపీటీసీ పొన్నాడ విజయ్ కుమార్, రాజ అప్పలనాయుడు,లింగాలపాడు ఎంపీటీసీ వాన నాగేష్, జలుమూరు మండలం ప్రెసిడెంట్ కోన దామోదర్ రావు, సుబ్రమణ్య పురం ప్రెసిడెంట్ రమణ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.



ఆంధ్ర రాష్ట్ర డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో పోలాకి మండలం ఎంపీపీ గా ఎన్నుకోబడ్డ ముద్దాడ దమయంతి బైరాగి నాయుడు కి విశాఖపట్నం పార్లమెంటరీ లీగల్ సెల్ అధ్యక్షుడు కరణం కృష్ణ పుష్పగుచ్ఛము తో అభినందనలు తెలియజేశారు.

## నూతన జెఈవోగా వీరబ్రహ్మయ్య బాధ్యతల స్వీకరణ




తిరుమల తిరుపతి :టీటీడీ దేవస్థానముల నూతన తిరుపతి జెఈవోగా వి.వీరబ్రహ్మయ్య శనివారం ఉదయం శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ డెప్యూటీ ఈఓ రమేష్ బాబు స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం, కాఫీ టేబుల్ బుక్ ను నూతన జెఈఓకు అందజేశారు.

ఈ సందర్భంగా వి.వీరబ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్వహణ చేస్తున్న టిటిడి లాంటి ప్రతిష్టాత్మక సంస్థలో సేవ చేయడం గొప్ప అవకాశమన్నారు. టిటిడి నియమ నిబంధనల మేరకు తనకు విధులు నిర్వహించే శక్తిని ప్రసాదించాలని స్వామివారిని ప్రార్థించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా టిటిడి బోర్డు ఛైర్మన్ శ్రీ వైవి.సుబ్బారెడ్డి, ఈఓ డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి డెప్యూటీ ఈవోలు హరీంద్రనాథ్, లోకనాథం, సుధారాణి, విజివో బాలిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా పండిత్ దీన్ దయాళ్ జయంతి వేడుకలు



విశాఖపట్నం :పండిట్ దీన్ దయాల్ జయంతి వేడుకలు మాధవధార వద్ద బీజేపీ నగర కార్యదర్శి తమ్మినేని పద్మజ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉత్తర నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే , బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.విష్ణుకుమార్ రాజు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసీ అంజలి ఘటించారు. ఈసందర్భంగా పండిట్ జీ సేవలను గుర్తు చేశారు. అందరూ క్రమశిక్షణతో ఉండాలి అన్నారు.

కార్యక్రమంలో బాగంగా మాధవధార ఉదా కోలని వద్ద నిన్న దివ్యంగులకు బ్రేడ్ లు పండ్లు అందజేసారు. కార్యక్రమంలో బీజేపీ 51 వ వార్డు అద్యక్షుడు సత్తార్ మెహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట నెరవేర్చడములో ఎమ్మెల్యే అధీప్‌కు సాటి ఎవ్వరు లేరు

### - సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు



పరవాడ : ఇచ్చిన మాట నెరవేర్చడములో స్థానిక శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ కు సాటి ఎవ్వరు లేరు అని ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు అన్నారు. ఇటీవల జరిగిన ముత్యాలమ్మపాలెం సెగ్మంట్ల్ లో గల ఎంపిటిసులును గెలిపిస్తే తన చెప్పినవాళ్ళుకే కోఅప్షన్ సభ్యులు పదవి ఇస్తాను అని మాట ఇచ్చారు...ఇచ్చిన మాట ప్రకారమే కోఅప్షన్ సభ్యునిగా ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన మైలపల్లి అప్పన్నను ప్రకటించారు..అన్నమాట ప్రకారము మత్సకార నాయకుడైన మైలపల్లి అప్పన్నకు కోఅప్షన్ పదవి ఇచ్చినందుకుగానూ స్థానిక శాసనసభ్యులు అన్నంరెడ్డిఅదీప్ రాజ్ ,ఎంపిపి పైలవెంకటపద్మశ్రీనువాస్ కు జడ్పిటిసి పియస్ రాజ్ కు,పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడుకు వైసిపి జిల్లా ప్రదాన కార్యదర్శి చుక్కరామునాయుడుకు ప్రత్యేక దన్యవాదములు తెలియపరిచారు. అనంతరము కో అప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్నకు పుష్పగుచ్ఛం అందజేసి దుశాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిక్కవానిపాలెం సర్పంచ్ చేపలు మసేను ,అమ్మోరు తథితర్లు పాల్గోన్నారు.

## సత్యదేవుని నిత్యాన్నదాన ప్రధకానికి రూ.1,00,000/- విరాళం

అన్నవరం : తూర్పుగోదావరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి మంచిర్యాల జిల్లా కు చెందిన చింతగుంట.ప్రసాద్ కుమార్ రూ.1,00,000/- విరాళమును దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు కు అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో జూన్ 19వ తేదీన మెహర్ సాయి హేమంత్ పేరున అన్నదానం జరిపించవలసిందిగా కోరారు.ఈ సందర్భంగా దాతలను ఈవో త్రినాధరావు అభినందించారు.



## జివియంసి ఆదాయానికి గండి కొడుతున్న స్థాయి సంఘం

**- పేదప్రజలపై చెత్త పన్ను వేయడం డిప్యూటీ మేయర్ కారుకి నెలకు రూ. 70 వేల అద్దె కట్టడమా?**

**- 25 వేల కళ్యాణ మండపం, షాదిఖానాల అద్దె 5 వేలకు కుదింపా. ప్రజలకు ఆ ధరకే ఇస్తారా.?**

విశాఖపట్నం : మహా విశాఖ నగర పాలక సంస్థ స్థాయీ సంఘం వ్యవహారాలు అవినీతికి చిరునామాగా మారుతున్నాయి. నగరపాలక సంస్థ ఆదాయం లేదంటూ సామాన్య ప్రజలపై ఆస్తి పన్ను భారం, చెత్త పన్ను భారం వేసిన పాలకులు మరోవైపు హేతుబద్ధంగా రావాల్సిన అద్దెల ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారని జనసేన పక్ష నేత పీతల మూర్తి యాదవ్ ఆరోపణ చేశారు. వంద కోట్లకు పైగా బకాయిలను షాపులు వారు, కళ్యాణ మండపాల లీజు దారులు, ఆశీలు దారులు చెల్లించాల్సి ఉండగా వారి నుంచి పెద్ద ఎత్తున లంచాలకు ఆశపడి 113 షాపులను రాత్రికిరాత్రి తెరి చేయాలని స్థాయీ సంఘం లోని కొందరు పెద్దలు చేస్తున్న హడావిడి పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. అధికారాలు లేని ఒక కమిటీని నియమించి అందులోని ప్రతిపక్ష సభ్యులు కూడా తెలియకుండా నివేదిక సమర్పించేసి షాపులను వెంటనే తెరిచేయాలన్న నిర్ణయం తీసుకోవడం నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించాలి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నగరపాలక సంస్థ ఆదాయం పెంచేందుకు కమిషనర్ చేస్తున్న ప్రయత్నాలకుకొందరు పాలకవర్గ సభ్యులు తూట్లుపొడుస్తున్నారు. నగర పాలక సంస్థల కౌన్సిల్ లో ప్రొసీడింగ్స్ ఇవ్వకుండా , అధికారాలు కట్టబెట్టకుండా నియమించిన అద్దెల కమిటీ అసలు చెల్లదు.ఆ విషయం తెలిసి కూడా కమిటీ నివేదిక పేరిట షాపులను తెరవాలని




ప్రయత్నించడం చట్టవిరుద్ధం. వీటితో పాటు రోజుకి 25000 అద్దె వచ్చే షాదీఖానా, మాదవస్వామి కళ్యాణమండపాల అద్దె లను హేతుబద్ధంగా పెంచాల్సిన పోయి అద్దె ల కమిటీ చైర్మన్ ప్రతిపాదన పేరిట దానిని ఐదు వేల కుదించడం చాలా దారుణం. నగరపాలక సంస్థ ఆదాయం పెంచాలని ఒకవైపుప్రజలపై భారం వేయడం మరో వైపు అధికార వైఎస్సార్ కాంగ్రెస్ సభ్యులే దీనికి విరుద్ధంగా వ్యవహారిస్తుండడం నిజంగా బాధాకరం. నిజాయితీగా పారదర్శకంగా పని చేస్తామని చెప్పి వైయస్సార్ ప్రభుత్వానికి ఇదో మచ్చ. ప్రభుత్వ పెద్దలు ఇప్పటికైనా స్పందించి శుక్రవారం నాటి స్థాయి సంఘం నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు , జీవో 56 మేరకు హేతుబద్ధంగా అద్దెలు నిర్ణయించి వసూలు చేసే అధికారాన్ని అధికారులకు అప్పగిస్తూ తీర్మానం చేయాలి. కమీషనర్, జోనల్ కమీషనర్ లు నిష్పక్షపాతం గా వ్యవహారించి షాపులను వేలానికి పెట్టినప్పుడు గతంలో కంటే ప్రస్తుతం నాలుగు రెట్లు నుంచి 20 రెట్ల వరకు జీవీఎంసీ ఆదాయం పెరగడం హర్షణీయం. వాస్తవం ఇలా వుండగా వున్న అద్దెలను తగ్గించి ఆదాయానికీ అధికార పార్టీ కార్పొరేటర్లే గండికొట్టడం దుర్మార్గం.

ప్రజా సేవ పేరిట ఎన్నికైన డిప్యూటీ మేయర్ లకు సొంత కార్లు వుండగా ఎప్పుడూ తిరగని ట్రావెల్స్ కారు పేరిట నెలకు రూ.70 వేల అద్దె చెల్లించాలని కోరడం, అది ఆమోదం పొందడం వారి సంకుచిత మనస్తత్వాన్ని తెలియజేస్తుంది. కారు అద్దెకే నెలకు 70 వేలు తీసుకొంటున్న వారు ఇతర ఖర్చుల పేరిట ఇంకెన్ని లక్షల ప్రజాధనాన్ని, జనం పన్నులను దోచుకొంటున్నారో? వీరి ఛాంబర్ లకు రూ. 60 లక్షల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తుండడం బాధాకరమే.

## క్షేత్ర స్థాయిలో కైలాసగిరి అభివృద్ధి పనులను మెట్రోపాలిటన్ కమిషనర్ తో కలిసి పరిశీలించిన వియంఆర్డిఏ చైర్పెర్సన్ అక్కరమాని విజయనిర్మల




విశాఖపట్నం : కైలాసగిరి మీద ప్రపంచ బ్యాంకు నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను మెట్రోపాలిటన్ కమీషనర్ వెంకటరమణ రెడ్డి తో కలిపి క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తదనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణ పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి సందర్శకులకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేయాలని అదేవిధంగా కైలాసగిరిపై ఉన్న శంఖు, చక్రనామాలను త్వరలోనే వెలిగే విధంగా సత్వరమే చర్యలు తీసుకోవాలని కూడా అధికారులను, గుత్తేదారు ప్రతినిధులను వియంఆర్డిఏ చైర్పెర్సన్ అక్కరమాని విజయనిర్మల ఆదేశించారు. తదుపరి తెన్నేటి పార్క్ సందర్శించిన అక్కరమాని విజయనిర్మల సందర్శకుల సౌలభ్యం మేరకు టాయిలెట్ నిర్మాణం చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. ఈ క్షేత్ర స్థాయి పర్యటనలో కార్పోరేటర్ స్వాతి దాస్, కార్యనిర్వాహక ఇంజనీర్ రామ్మోహన్ రావు, డి.ఎఫ్.ఓ శాంతి స్వరూప్, పర్యవేక్షక ఇంజనీర్ తాతాజీ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంబేరుపురం ఎంపీటీసీ లక్ష్మీనాగేశ్వరరావుకు వైస్ ఎంపీపీ అవకాశం

**- గవర సామాజిక వర్గం నుంచి తీవ్ర పోటీ - ఎమ్మెల్యే ధర్మశ్రీ, గౌరీ సంఘ పెద్దలు సూచనతో ఐదేళ్ల కాలపరిమితి లో ఇద్దరికీ అవకాశం**

**- ఎంపీటీసీ బుద్ధ గంగరాజు కు రెండున్నరేళ్లు - శరగడం లక్ష్మీ నాగేశ్వరరావుకు మరో రెండున్నర ఏళ్లు**

చోడవరం : చోడవరం మండల అధ్యక్షుల స్థానం ఎస్ సి కులానికి రిజర్వు కావడంతో గాడి కాసును ఆ పదవి వరించడంతో వైస్ ఎంపీపీ స్థానానికి తీవ్ర పోటీ నెలకొంది. గతంలో చోడవరం పరిషత్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా, జడ్పీటిసి , ఎంపీపీ పదవి రెండింటిలో ఏదో ఒక దానిని గవర కమ్యూనిటీకి ఇవ్వడం దశాబ్దాల కాలం నుండి ఆనవాయితీగా వస్తుంది. అయితే ఇటీవల జరిగిన మండల పరిషత్ ఎన్నికలలో చోడవరం ఎంపీపీ పదవి ఇతర కమ్యూనిటీ కి రిజర్వు అవడంతో వైస్ ఎంపీపీ పదవికి గవర సామాజిక వర్గం నుండి గజపతినగరం ఎంపీటీసీ సభ్యులు బుద్ధ గంగరాజు, అంబేరుపురం ఎంపీటీసీ శరగడం లక్ష్మీ నాగేశ్వరరావు ల మధ్య పోటీ నెలకొంది. దీంతో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, చోడవరం గౌరీ సంఘం పెద్దలు కాండ్రేగుల డేవిడ్, వైసిపి సీనియర్ నాయకులు శరగడం సిమ్మి నాయుడు సూచన మేరకు వైస్ ఎంపీపీ ఐదేళ్ల కాలపరిమితిని చెరో రెండున్నరేళ్లు పదవీ బాధ్యతలు చేపట్టేందుకు నిర్ణయించడంతో పాటు, వైసీపీ నుంచి గెలుపొందిన ఎంపీటీసీ సభ్యులు దానికి ఆమోదం తెలపడంతో సమస్య కొలిక్కి వచ్చింది. ప్రస్తుతం రెండున్నరేళ్లు బుద్ధ గంగరాజు వైస్ ఎంపీపీ గా బాధ్యతలు చేపట్టగా, అనంతరం మరో రెండున్నరేళ్లు అంబేరుపురం ఎంపిటిసి శరగడం లక్ష్మీ నాగేశ్వరరావు వైస్ ఎంపీపీగా పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు.



అంబేరుపురం ఎంపీటీసీ శరగడం లక్ష్మీ నాగేశ్వరరావు

# నర్సీపట్నం జడ్పీటీసీ గా సుకల రమణమ్మ

- టీడీపీ నుండి జిలాలో ఏకైక మహిళా జడ్పీటీసీ గా రమణమ్మ

6 జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ప్రమాణ స్వీకార మహోత్సవం





విశాఖపట్నం జిల్లా (నర్సీపట్నం) : విశాఖ జిల్లాలోని, జిల్లా చరిత్రలోనే తెలుగుదేశం పార్టీ నుండి ఏకైక జిల్లా పరిషత్తు ప్రాదేశిక సభ్యురాలిగా ఎన్నికైన మహిళగా సుకల రమణమ్మ ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా గుర్తింపు పొందారు. జెడ్ పి టి సి ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి శనివారం విశాఖపట్నం జిల్లా పరిషత్ కార్యాలయానికి హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... ప్రస్తుతం రైతులు, మహిళలు, సామాన్య ప్రజలు ధరల పెరుగుదల వలన పడుతున్న ఇబ్బందులపైనా, గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలపైనా, అటు అధికారులను ఇటు ప్రజాప్రతినిధులను నిలదీసి బాధిత వర్గాలకు న్యాయం చేసే దిశగా ముందడుగు వేస్తాను అన్నారు. ఆమెకు శుభాకాంక్షలు తెలిపేందుకు నర్సీపట్నం ప్రాంతం నుండి పెద్ద ఎత్తున అభిమానులు కార్యకర్తలు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద ఆమెకు ఘన స్వాగతం లభించింది.

ఈ కార్యక్రమంలో ధర్మసాగరం గ్రామ ప్రేమాభిమాని సుకల అప్పలనాయుడు, టిడిపి అనకాపల్లి పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి సత్య, ధర్మసాగరం గ్రామం నుండి ఉప సర్పంచ్ బీమిరెడ్డి వెంకటలక్ష్మి , గ్రామ కమిటీ అధ్యక్షులు కళ్ళెంపూడి సత్తిబాబు, మండల పార్టీ కార్యదర్శి భీమిరెడ్డి గోవింద, వేమవరపు సత్తిబాబు, వార్డు మెంబర్లు, పాల సొసైటీ మాజీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ పార్టీ అధిష్ఠానం ఇచ్చిన హామీ, మాట మార్చటడం వల్లే టీడీపీ మద్దతుతో ఎంపీపీ పదవీ చేపట్టాము

మా ప్రాణం ఉన్నంతవరకు వైసీపీలో ఉంటాము. మాజీ ఎంపీపీ ఎస్వీ రమణమూర్తి

పాడేరు : స్థానిక సంస్థ ఎన్నికల సమయంలోను, ఎంపిటిసి ఫలితాలు వచ్చిన తరువాత కూడాను ,వంతాడపల్లి సెగ్మెంట్ నుంచి ఎంపిటిసిగా విజయం సాధించిన పాడేరు ఎంపీపీగా పదవీ ని చేపట్టిన సోనారి రత్నకుమారిని వైసిపి అధిష్ఠానం ఆశీస్సులతో ఎంపీపీ పదవీ ఇస్తామని హామీ ఇచ్చి, ఇచ్చిన హామీ తుంగలో తొక్కినందుకే టిడిపి, స్వతంత్ర ఎంపిటిసిలు మద్దతుతో పాడేరు ఎంపిపి పదవీ బరిలో నిలిచి ఎంపీపీ పదవిని కైవసం చేసుకోవడం జారిందని మాజీ ఎంపీపీ ఎస్వీ రమణ మూర్తి అన్నారు.శనివారం ఆయన నివాసంలో స్థానిక విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 28 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నామన్నారు. 1994లో కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, తరువాత జిల్లా కమిటీలో కార్యదర్శి,బలిరెడ్డి సత్యరావు హయాంలో కాంగ్రెస్ పార్టీ తన సేవలు అందించనని, తనకు కాంగ్రెస్ పార్టీ ఎంపిటిసి సీట్లు కేటాయించిదాని, దాని ఫలితంగానే 2006 లో పాడేరు ఎంపీపీగా ఐదేళ్ళ సేవలు అందించమన్నారు. స్వర్గీయ నేత డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి హఠాత్తుగా మరణానంతరం చోటు చేసుకున్న రాజకీయ పరిమాణాలు తరువాత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పక్షాన ఉండి, ఆయన స్థాపించిన వైసిపి పార్టీలో ఒక సామాన్య కార్యకర్తగా సేవలు, పార్టీ బలోపేతానికి కృషి చేశామన్నారు. వైసిపి పార్టీ మండల, గ్రామ కమిటీలో కూడాను సముచితమైన స్తానం ఇవ్వలేదన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో పాడేరు ఎమ్మెల్యే కోట్టగుల్లి భాగ్యలక్ష్మి వంతాడపల్లి ఎంపిటిసి సీటును కేటాయించారని, ఎన్నికల్లో ఎంపిటిసిగా అఖండ విజయం సాదించామన్నారు. ఎన్నికల సమయం, ఫలితాలు తరువాత తాము టిడిపి పార్టీలో చేరు తున్నా రని, టిడిపి పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు దుష్ప్రచారం, చేస్తున్నారని, దాంట్లో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. మా ప్రాణం ఉన్నంత వరకు వైసిపి పార్టీలో ఉంటా మన్నారు. పార్టీలో ఉన్నవారికి ఎవ్వరు నమ్మక ద్రోహం చేశారో ప్రజలు గమనిస్తున్నారు. అనంతరం ప్రస్తుత ఎంపీపీ సోనారి రత్నకుమారి మాట్లాడుతూ ఎంపిటిసిగా, పాడేరు ఎంపిపి గా ఆశీర్వదించిన, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కు, పాడేరు ఎమ్మెల్యే కోట్టగుల్లి భాగ్యలక్ష్మి, వైసీపి పార్టీ అధిష్ఠానానికి, మండల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# సాక్ష్యాల ప్రాధాన్యత అనే అంశం మీద మిరాజ్ ఉద్దీన్ మీర్ ప్రసంగించారు




సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ విశ్వవిద్యాలయం లోని ఇంక్యూబేషన్ సెంటర్ వారు నిర్వహిస్తున్న రెండు రోజుల ఫోరెన్సిక్ సైన్స్ మరియు సాక్ష్యాల ప్రాధాన్యత అనే అంశం మీద రెండు రోజుల వర్కషాప్ ప్రారంభమయినది. ఈ ప్రారంభ కారక్రమణకు ముఖ్య అతిధి గా సెంట్రల్ యూనివర్సిటీ అఫ్ కాశ్మీర్ ఉపకులపతి ప్రొ. మిరాజ్ ఉద్దీన్ మీర్ హాజరయి ముఖ్య ఉపన్యాసం అందించారు. ఈ కార్యక్రమము లో వైస్ ఛాన్సలర్ ప్రొ.స.సూర్యప్రకాష్ ప్రారంభ ఉపన్యాసము ఇచ్చి అతిధులందరిని ఆహ్వానించారు. ప్రారంభ ఉపన్యాసం చేసిన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ (డాక్టర్) సూర్య ప్రకాష్ మాట్లాడుతూ క్రిమినల్ మరియు సివిల్ కేసులలో ఫోరెన్సిక్ సైన్స్ యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ ఎన్నో కేసులలో సరైన సాక్ష్యాలు లభించని పరిస్థితుల్లో ఫోరెన్సిక్ సైన్స్ లోని అనేక మెళకువలను అనుసరించి కేసులను పరిష్కరించిన సందర్భాలు అనేకం ఉన్నాయి నేటి నేరపరిశోధన లో ఫోరెన్సిక్ సైన్స్ యొక్క ప్రాధాన్యత ఏంతో ఉన్నదని, భవిష్యత్తు న్యాయవాదులైన విద్యార్థులు ఫోరెన్సిక్ సైన్స్ ను ఉపయోగించి సాక్ష్యాలను ఎలా పొందవచ్చొ అనే దాని పై నిపుణత సాధించాలని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధి ఐన సెంట్రల్ యూనివర్సిటీ అఫ్ కాశ్మీర్ ఉపకులపతి ప్రొ. మిరాజ్ ఉద్దీన్ మీర్ మాట్లాడుతూ మారుతున్న నేటి సమాజం లో నేరాన్ని నిరూపించడం చాలా కష్టం గా మారుతున్నదని, ఎందువల్లనంటే నేరాలు చేసివిధానం లో మార్పు వచ్చినదని, నేడు అందుబాటులో ఉన్న సాంకేతికతను ఉపయోగించుకుని నేరస్తులు చట్టానికి దొరకకుండా ప్రత్నిస్తున్నారని అందువల్ల నేర పరిశోధకులు, మరియు పోలీసు వారు కూడా సాంకేతికతను ఉపయోగించుకొని నేర పరిశోధనను చేయాలని అప్పుడే సరైన సాక్ష్యలు సంపాదిస్తారు.

# గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యం

భీమునిపట్నం : భీమిలి మండలం అన్నవరం బీచ్ వద్ద గుర్తు తెలియని మహిళా మృత దేహం లభ్యమైనట్లు భీమిలి పోలీసులు తెలిపారు. పోలీసులు కధనం ప్రకారం భీమిలి మండలం లోని, అన్నవరం బీచ్ ఒడ్డున గుర్తు తెలియని సుమారు 32ఏళ్ల వయస్సు ఉన్న మహిళ మృతదేహం ఉండడం అన్నవరం గ్రామ మత్స్యకారులు చూసారు. కాగా మత్స్యకారులు స్థానిక విఆర్ఎ కి చెప్పగా ఆయన సంఘటన స్థలానికి వెళ్లి చూసి పోలీసులు కు కంప్లైంట్ చేశారు.

దాంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం ను పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# రవీంద్రనాథ్ ను కలిసిన శీలం నదియా



పరవాడ: విశాఖపట్నం విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎం ఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంకా రవీంద్రనాథ్ ని శనివారం ఎంఎస్ఎం ఈ విశాఖపట్నం డైరెక్టర్ శీలం నదీయా పుష్పగుచ్ఛం అందజేసి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరము విశాఖపట్నంలో పరి శ్రమల గురించి పలు సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం లో సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు ఏ రకంగా డెవలప్ చేయాలి. కొత్త పరిశ్రమల స్థాపన కై యువతకి ప్రోత్సహించాలనే విషయం మీద చర్చించినట్టు నదియా తెలియజేశారు.

## పేద, వృద్ధ మహిళలకు

# చీరలు బియ్యము పంపిణీ

భీమునిపట్నం : పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 105 వ జయంతి వేడుకులను భారతీయ జనతా పార్టీ తగరపువలస మండలం 2 కుమ్మరి సంత పేట లో పార్టీ అధ్యక్షులు శీరపు. రామలక్ష్మి అధ్యక్షతన ప్రధాన కార్యదర్శి కురుమెళ్ల కవిత, కార్యవర్గ సభ్యురాలు గుజ్జు నర్సుబాయి ఆర్థిక సాయంతో చీరలు, వైస్ ప్రెసిడెంట్ శీరపు గోవిందరావు ఆర్థిక సాయంతో బియ్యము 10మంది పేద, వృద్ధ మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో ప్రధాన కార్యదర్శులు రేఖ కరుణ, కురుమెళ్ల కవిత, ఉపాధ్యక్షులు శీరపు. గోవిందరావు, కురుమెళ్ల వెంకటేశ్వర రావు మహిళా మోర్చా అధ్యక్షులు రేఖ రేణుక, గుజ్జు నర్సుబాయి, జిల్లా నాయకులు చిల్ల త్రినాధ్ రెడ్డి,శీరపు ఈశ్వరమ్మ, ఎడ్లపల్లి రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక పండిట్ నెహ్రు నగరపాలక ఉన్నత పాఠశాలలో

# హిందీ పరీక్షలు ప్రారంభం



భీమునిపట్నం : స్థానిక పండిట్ నెహ్రు నగరపాలక ఉన్నత పాఠశాల హిందీ పరీక్షలు. ప్రాధమిక, మధ్యమా, రాష్ట్ర భాషా, ప్రవేశిక, రాష్ట్ర బాషా ప్రవీణ పూర్ధార్ధ, రాష్ట్ర బాషా విషర్ధ ఉత్తర్ధ, రాష్ట్ర బాషా ప్రవీణ్ పూర్వర్ధ, రాష్ట్ర భాషా ప్రవీణ్ ఉత్తర్ధ మొత్తం ఏనిమిది పరీక్షలకు 44 మంది హాజరు అయినారు. రేపు ప్రవేశిక, విషర్ధ, ప్రవీణ్ వారికీ మాత్రమే పరీక్షలు జరుగుతాయని. ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కృష్ణారావు తెలిపారు. ఈ పరీక్షలకు పర్యవేక్షులు గా ఎం.రమాదేవి మరియు కె.రమాదేవిలు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం కిట్లు పంపిణీ




జనసేన పార్టీ సభ్యత్వ కిట్లు పంపిణీ చేస్తున్న భక్తాంజనేయ స్వీట్స్ అధినేత సత్యనారాయణ, శరగడం రామకృష్ణ తదితరులు

చోడవరం : మండలంలోని అంబేరుపురం, గోవాడ, భోగాపురం గ్రామాలలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం కిట్లను శనివారం పంపిణీ చేశారు. జనసేన పార్టీ టౌన్ అధ్యక్షులు గూనురు మూలు నాయుడు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు కర్రి రమేష్, మాజీ ఎంపీటీసీ అల్లం రామ అప్పారావు, శరగడం రామకృష్ణ, దాడి కుమార్, పి.మహేష్, భోగాపురం మాలి నాయుడు, భక్తాంజనేయ స్వీట్స్ సత్యనారాయణ, కుప్పిలి అప్పలస్వామి, జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పూర్ణా మార్కెట్‌లో వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని

## కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న విల్లూరి భాస్కరరావు



విశాఖపట్నం : 35 వ వార్డు లో ఉన్న జివియంసి ఫ్రూట్ వ్యాపారులు జ్ఞానాపురంలో ఉన్న కూరగాయల వ్యాపారులు అందరూ ఇదివరకు పూర్ణ మార్కెట్ లో సొంత భవనాలు షాప్ ల లో వ్యాపారం చేసుకునే వారు అప్పటి ట్రాఫిక్ సమస్య లను దృష్టిలో పెట్టుకుని సమస్యలను పరిష్కరించాలని వారి ని పూర్ణా మార్కెట్ నుంచి తరలించి ఇక్కడ కాలి జాగా నిరుపయోగంగా ఉన్న ఓల్డ్ బస్సు స్టాండ్ స్థలం ఫ్రూట్ వ్యాపారులు కి కేటాయించారు వ్యాపారులు బ్యాంక్ వారి సహాయం తో లోన్ తీసుకుని షాప్ లు నిర్మాణం పనులను ప్రారంభించారు. అలాగే కూరగాయల వ్యాపారులు కి శ్మశాన స్థలం పక్కన ఉన్న కాలి స్థలం చూపించారు అక్కడ మన జివియంసి వారు అర్ధవంతము గా మార్కెట్ నిర్మాణం చేసి కూరగాయల వ్యాపారులు కి కేటాయించారు.అందరూ సుమారు 30 సం ల గా జానపురం మార్కెట్ వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తు న్నారు వారు కూడా పూర్ణా మార్కెట్ లో సొంత భవనాలు వ్యాపారులు చేసుకునే వారు అప్పటి ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని జివియంసి వారు అక్కడ నుంచి శ్మశాన స్థలం పక్కనే ఉన్న ఖాళీ స్థలం లో యార్డ్ అర్థవంతం గా నిర్మాణం చేపట్టి షాప్ లు కేటాయించారు అప్పటి రేట్లు ప్రకా రం అద్దె నిర్ణయించారు అనంతరం 2015 వరకు 33% పెంచి రెన్యూవల్ చేశారు ఆ తర్వాత నుంచి రెన్యూవల్ కోసం వ్యాపారులు పలుమార్లు అధికారులకు విన్నవించినా అధికారులు నుంచి వ్యాపారులు కి సరియైన సమాధానం రాలేదు ఈ లోగా జీవో నెం. 56 అని మనం అమాంతం అద్దె రేట్లు పెంచి 10000/ షాపు కి 145000/ పెంచి అద్దె రూపంలో వ్యాపారులు చెమట ని వారి కష్టాన్ని దోచుకునే విధంగా వారిని ఇబ్బందులు పెట్టిన వారి మావుతాము.

## మునిసిపల్ ఉన్నతాధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసన

భీమునిపట్నం : ఏపి ఎంటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఏపి ఎంటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్. అమర్నాథ్ ఆధ్వర్యం లో స్థానిక డాక్టర్. అంబేడ్కర్ జివిఎంసి ప్రాథమిక పాఠశాల లో మధ్యాహ్న భోజన విరామ సమయం లో మునిసిపల్ టీచర్స్ వివిధ సమస్య ల విషయమై మునిసిపల్ ఉన్నతాధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసన తెలియజేశారు. ఇందులో భాగంగా క్రింది సమస్యల గురించి ప్రస్తావించడం జరిగింది. మునిసిపల్ టీచర్స్ పిఎఫ్ సమస్య ను అలాగే మునిసిపల్ పాఠశాలలు గల ప్రతి యుఎల్‌బి లో మునిసిపల్ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలనీ, బోధనేతర సిబ్బంది కి మాత్రమే జూనియర్ లెక్చరర్లు పదోన్నతులు కల్పిస్తూ ఇచ్చిన జీఓ.223 ని రద్దు చేసి, స్కూల్ అసిస్టెంట్ లకు కూడా జే ఎల్ పదోన్నతులు కల్పించడం కోసం జీ ఓ. విడుదల చేయాలని అలాగే ఇతర సమస్యలని పరిక్షించాలని ఏపిఎంటిఎఫ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఏపి ఎంటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.అమర్నాథ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.దుర్గ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎస్.జగదీష్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం. మురళి కృష్ణ, వై.వెంకటేష్, కే. ఇందిర, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.లీలామణి, సహోదర ఉపాధ్యాయిని, ఉపాధ్యాయు లు పాల్గొన్నారు.

# బోధన, అభ్యసనం ఆసక్తిదాయకంగా సాగాలి

## వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి



అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి




ఆంధ్రాయూనివర్శిటీ : బోధన, అభ్యసన విధానాలు ఆసక్తిదాయకంగా సాగాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఫార్మశీ కళాశాల ఏఐసిటిఇ అటల్ పథకంలో భాగంగా నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డిపి) 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్-రివల్యూషనరీ ఇంపాక్ట్ ఆన్ ఫార్మసూటికల్ ఎడ్యుకేషన్ అండ్ ఇండస్ట్రీ' ముగింపు సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల పట్ల శ్రద్ధ, సంరక్షణ బాధ్యతలను అధ్యాపకులు కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు వికాసానికి మార్గం చూపే విధంగా అధ్యాపకుల బోధన విధానం సాగాలని సూచించారు. విద్యతో పాటు వ్యక్తిత్వం ఎంతో ప్రధానమన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఐఓటి, మెషీన్ లెర్నింగ్‌పై సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను నాస్‌కామ్ సహకారంతో ఏర్పాటు చేసామన్నారు. ఇప్పటికే ఇది తమ సేవలను ఆరంభించడానికి సిద్దమైందన్నారు. ఫార్మా రంగానికి ఉపయుక్తంగా ఈ కేంద్రం తన సేవలు ఆరంభిస్తుందన్నారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లను సైతం అందిస్తామన్నారు.

సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఐఓటి ఎంతగానో ప్రభావితం చేస్తుందన్నారు. ఐఓటి అన్ని రంగాలలో మిళితం అవుతూ తన గమనం సాగిస్తోందన్నారు. భవిష్యత్తులో యువతను ఉపాధి కోసం ఆలోచించే స్థాయి నుంచి ఉపాధిని అదించే పారిశ్రామిక వేత్తలుగా మలచే ప్రయత్నం జరుగుతోందన్నారు.కార్యక్రమంలో ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, సదస్సు కన్వీనర్ ఆచార్య క్రిష్ణమంజరి పవార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## జడ్పీటీసీగా పి.యస్.రాజు ప్రమాణ స్వీకారం



పరవాడ : స్థానిక శాసనసభ్యులు అన్నంరెడ్డి అధీప్‌రాజ్ ఆశీస్సులుతో పరవాడ జడ్పిటిసిగా పరవాడమండలము తాణాం గ్రామానికి చెందిన పి.యస్‌అ.రాజు అత్యదిక మెజార్టితో గెలిపొందిన సంగతీ అందరికీ తెలిసిందే. ఈయన శనివారము పరవాడ జడ్పిటిసి సభ్యులుగా ప్రమాణ స్వీకారము చేసారు. పి.యస్.రాజుకు మండలములో గల నాయకులు, అధికారులు, కార్యకర్తలు అభినందనలు తెలియపరిచారు.

నేడు తాణాంలో

## ఉచిత నేత్ర వైద్యశిబిరం




పరవాడ:పరవాడ మండలము తాణాం గ్రామంలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఈనెల26న అనగా ఆదివారం ఉచిత నేత్రవైద్యశిభిరం ఏర్పాటుచేస్తున్నట్లు కన్నూరు యువసేన సభ్యులు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిభిరంలో సంబందిత వైద్యులు పరీక్షలు నిర్వహించి,ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తారని ఈ సందర్భంగా తెలిపారు.ఈ అవకాశాన్ని గ్రామస్తులు వినియోగించుకోవాలని యువసేన సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా తాణాం సర్పంచ్ కన్నూరుదేవి,మాజీ జెడ్పీటీసి పైల జగన్నాధరావు, తాణాం ఎంపిటిసి రొంగలి సునీత గోపాలకృష్ణ, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ పాల్గొంటారని తెలిపారు. ఈ ఉచిత నేత్రవైద్యశిభిరం విశాఖ కంటి ఆసుపత్రి పెదవాల్తేరు వారిఅద్వర్యంలో నిర్వహించుబడుతుంది అని తెలిపారు. కావున గ్రామస్థులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కన్నూరు యువసేన సభ్యులు కోరారు.

## పదోన్నతులుకల్పనపై హర్షం

విజయవాడ : ప్రజా రవాణా శాఖ, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రెండు వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పనపై వైఎస్సార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేసింది.

భారతీయ జనతా శంఖవరం మండల అధ్యక్షులు పడాల నాగు ఆధ్వర్యంలో

## బీజేపీ సిద్దాంత కర్త దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు





అన్నవరం : భారతీయ జనతా శంఖవరం మండల అధ్యక్షులు పడాల నాగు ఆధ్వర్యంలో బీజేపీ సిద్దాంత కర్త దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు మండల వ్యాప్తంగా పలు గ్రామల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగు మాట్లాడుతూ రెండు సీట్ల నుంచి 300 పైగా సీట్లు ఈరోజు బిజెపి సంపా దించుకుంది అంటే కేవలం ఉపాధ్యాయ గారి సిద్ధాంతమని, నాడు ఆయన నిర్దేశించిన విదానం లోనే క్రమమైన సిద్ధాంతంతో నిజాయితీ పరిపాలన నేడు దేశానికి భారతీయ జనతా పార్టీ అందిస్తుందని "ఏకాత్మతా మానవతా సిద్ధాంతం" నేటి భారతావనికి అనుసరణీయమని, ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త, యువత దీన్ దయాల్ ఉపాధ్యాయ సిద్ధాంతాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల దండ వేసి నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంట్ అప్పికొండ జోగిబాబు, కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు బాలిపల్లి చక్రి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాలు



విశాఖపట్నం : పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాలు విశాఖ దక్షిణ నియోజకవర్గం లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఫిషింగ్ హార్బర్ మండలం126.126 పోలింగ్ బూత్ లలో పండిత్ దీన్ దయాల్ గారు గొప్ప వ్యక్తి అని ఏకాత్మ మావవవాదమును ప్రవచించిన ఋషి, సమగ్ర భారతాన్ని, సమైక్య భారతాన్ని తీర్చిదిద్దాలనెడి తపనతో జగద్గురు శంకరాచార్య ను స్ఫూర్తిగా స్వీకరించి, తమ రచనల ద్వారా, ఉపన్యాసాల ద్వారా యువతకు ప్రేరణ నందించిన మహాను భావుడు, భారతీయ జనసంఘ్ ను ఆదర్శవంతమైన రాజకీయ పక్షంగా రూపొందించిన జాతీయ నాయకుడు, సమాజానికై తన సర్వస్వాన్ని త్యాగం చేసిన ఆధునిక దధీచి మహర్షి శ్రీదీనదయాళ్ ఉపాధ్యాయ.. అని వారి గురించి వివరించి అనంతరం మండల అధ్యక్షులు వాసుపల్లి రామారావు మరియు జిల్లా బీజేపీ కార్యదర్శి కె.నాగమణి, ఆధ్వర్యంలో పేదలకు ఆహారం మరియు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో....

రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్. విజయ్ ఆనంద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దామోదర్ యాదవ్, నియోజకవర్గం కోఆర్డినేటర్ కొప్పల రామ్ కుమార్, ఉపాధ్యక్షులు చొక్కాకుల రాంబాబు, బీజేపి నాయకులు సురాడ రాజు, పల్లా చలపతి, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

అతిపెద్ద వార్షిక ఫెస్టివ్ సేల్

## ది రగ్ ఉత్సవ్ ని ప్రకటించిన జైపూర్ రగ్స్

విశాఖపట్నం : ఇంటి కోసం దిగ్గజ రగ్స్ తో పండగ స్ఫూర్తిని ఉత్సాహపరచడానికి జైపూర్ రగ్స్ తమ వార్షిక సేల్ ద రగ్ ఉత్సవ్ ని ప్రకటించింది. రగ్స్ ఫెస్టివల్ లో ఇది ప్రతి ఇంటి కోసం నేత పని వారు కళాత్మకంగా వ్యక్తీకరించి తయారు చేసిన వాటిని వేడుక చేస్తోంది. కస్టమర్స్ యొక్క విలక్షణమైన అవసరాలకు అనుగుణంగా జైపూర్ రగ్స్ చేతితో తయారు చేసిన వందలాది కార్పెట్లని తమ వెబ్ సైట్ పై అందించడం ద్వారా పండుగ షాపింగ్ అనుభవాన్ని పెంచింది, కస్టమర్లు తమ ఇళ్ళలో సౌకర్యం కోసం కొనుగోలు చేయవచ్చు. పరిపూర్ణమైన ఎంపికని చేయడానికి కస్టమర్కు మార్గదర్శకత్వం వహించే నిపుణులను సంప్రదించడానికి కూడా వారు అవకాశం కలిగిస్తున్నారు. జైపూర్ రగ్స్ వెబ్ సైట్ స్టోర్వీ సిట్ ఆఫర్లు ద్వారా 20 శాతం నుంచి 60 శాతం వరకు తగ్గింపు ధరలకు నైపుణ్యంగా తయారు చేసిన విలక్షణమైన నవీన డిజైన్లతో షాపింగ్ అనుభవం నిరంతరం చేయడానికి సేల్ కూర్చబడింది. పండుగ ఉత్సాహంతో తమ ఇళ్లను పునరుద్ధరించడానికి కస్టమర్స్ వివిధ రకాల డిజైన్లను ఎంచుకోవచ్చు. మొదటిసారిగా దిగ్గజ కలెక్షన్స్ డిస్కౌంట్ కి అందిస్తుండడం రగ్ ఉత్సవ్ ప్రధాన ఆకర్శనగా నిలుస్తుంది.

## సింహాచ లేశున్ని దర్శించుకున్న పలువురు ప్రముఖులు-ఉన్నతాధికారులు





సింహాచలం : సింహగిరి పై వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని శనివారం నాడు హై కోర్టు న్యాయమూర్తి డి రమేష్ పివిజి రాజు అల్లుడు మాజీ ఎంపీ ప్రదీప్ చంద్రదేవ్ మరియు ఐక్యరాజ్య సమితి శాంతి రాయబారి వెంకట్ భవాని అరుణ్ కొండూరు తది తరులు దర్శించుకున్నారు. సింహగిరి కి చేరుకున్న వీరికి ఆలయ అధి కారులు సాదర స్వాగతం పలు కగా ఆలయంలో పూజలు అనంతరం కప్పస్తంబ ఆలింగనం లక్ష్మీ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు బేడా మండపంలో వీరికి వైధి కులువేద ఆశీర్వచనం పలుకగా అధికారులు వీరికి స్వామివారి చిత్రపటం తీర్ధ ప్రసాదాలు అందజేశారు.





గిరిజన హక్కులకు భంగం కలగకుండా

# చట్టాలను అమలు చేయాలి

## ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ రోణంకి..



పాడేరు : గిరిజన హక్కులు చట్టాలపై రెవెన్యూ అధికారులకు సంపూర్ణమైన అవగాహన ఉండాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి గోపాలకృష్ణ పేర్కొన్నారు. శనివారం ఐటిడిఏ సమావేశ మందిరంలో 11 మండలాల తహశీల్దార్లకు డిప్యూటీ తహసీల్దార్లకు వీఆర్వోలకు గిరిజన హక్కులు గిరిజన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 1/70 చట్టం పీసా చట్టం 1996 అటవీ హక్కుల చట్టం 2006 భూసేకరణ చట్టం 1894 -2013 జాతీయ రహదారుల చట్టం 1956 -2013 జనన మరణాలు ఏపీ భూ ఆక్రమణ చట్టం 1905 పట్టాదారు పాసు పుస్తకాల చట్టం 1971 సర్వే హద్దుల చట్టం 1923 మ్యుటెసన్, రైస్ కార్డులు ఐదవ షెడ్యూలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో భూము లను గిరిజనేతరు లకు బదలాయింపు ఉంచడం నిషేధం అన్నారు. 1994లో జరిగిన సమత కేసులో సుప్రీంకోర్టు తీర్పును ఈ సందర్భంగా ఆయన ఉదహరించారు. చట్టాలు సమర్థవ ంతంగా అమలు చేసి రూల్స్ పాటిస్తే ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కావని అన్నారు. 1/70 చట్టం పీసా చట్టం గురించి వివరించారు. షెడ్యూల్ ప్రాంతంలో స్వయం పరిపాలన అటవీ ఉత్పత్తుల యాజమాన్యం గ్రామసభ నిర్వహణ వాటిలో చర్చించవలసిన అంశాలను తెలియజేశారు. గ్రామ సభకు సామాజిక సంస్థల పై ఆధిపత్యం ఉంటుందన్నారు. రెవెన్యూ అధికారులకు ఎటువంటి ప్రతిపాదనలు వచ్చినా గ్రామ సభ తీర్మానం ఉందా లేదా పరిశీలించాలన్నారు. 2005 డిసెంబర్ 13 నాటికి ముందు గిరిజనుల సాగులో ఉన్న భూములకు మాత్రమే అటవీ హక్కు పత్రాలు జారీ చేస్తామన్నారు.



లబ్ధిదారులకు 2013 సంవత్సరం నాటికి 18 ఏళ్లు వయస్సు నిండి ఉండాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 80 వేల ఎకరాలకు అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అభిషేక్ సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి శ్యామ్ ప్రసాద్ రిటైర్డ్ ఎస్ డి సి టి అప్పారావు ఆర్ ఓ ఎఫ్ ఆర్ డి టి జి ఈశ్వర్రావు 11 మండలాల తహశీల్దార్లు డిప్యూటీ తాసిల్దార్ విఆర్ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# మద్య నియంత్రణ పై రాష్ట్ర ప్రభుత్వం కట్టబడి ఉంది

**- ఐక్యత తోనే మద్య నియంత్రణ సాధ్యం . - మద్యం అమ్మకాలు 40 శాతం , బీరు అమ్మకాలు 20 శాతం తగ్గటం శుభ పరిణామం.**

**- ఏపీ మద్య విమోచన ప్రచార కమిటీ రాష్ట్ర చైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి.**




మాధవధార ( విశాఖపట్నం ) :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బహుముఖ కార్యక్రమాలతో మద్య నియంత్రణ వైపు వేగంగా అడుగులు వేస్తుందని మద్యం అమ్మకాలు గణనీయంగా తగ్గాయని ఏపీ మద్య విమోచన ప్రచార కమిటీ రాష్ట్ర చైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి శనివారం విశాఖపట్నం లోని సెట్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడారు .గత సంవత్సరాలుగా మద్యం అమ్మకాలు 40 శాతం , బీరు అమ్మకాలు 20 శాతం తగ్గటం శుభపరిణామమన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నెలకు 34 లక్షల కేసులు మద్యం అమ్మకాలు జరగ్గా నేడు 21 లక్షల కేసులకు తగ్గిందని బీరు అమ్మకాలు నెలకు 17 లక్షల కేసుల నుండి 7 లక్షల కేసులకు తగ్గాయని వివరించారు.గతంలో ప్రైవేటు రంగంలో మద్యం షాపులు ఉదయం 9 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు విక్రయిస్తుండుగా నేడు ప్రభుత్వ మద్యం షాపులు ఉదయం 11 గంటల నుండి రాత్రి 8 గంటల వరకే పనిచేస్తున్నాయని అన్నారు.గత ప్రభుత్వం మద్యం వ్యసనాన్ని అనధికారిక బెల్టు షాపుల ద్వారా ప్రజల చెంతకు చేరిస్తే నేడు బెల్టుషాపులను సమూలంగా తొలగించడం జరిగిందన్నారు.

మద్యం ధరలు పెరగటం వలన మద్యం అమ్మకాలు తగ్గినా మరొకవైపు అక్రమ మద్యం , నాటుసారా , గంజాయి లాంటి మత్తుపానీయాలు పెరుగుతున్నాయని వీటిని నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్ బ్యూరో కు నిజాయితీ గల ఐపీఎస్ ఆఫీసర్ వినీత్ బ్రీజ్ లాల్ నేతృత్వంలో ఏర్పటు చేసి అక్రమదారులపై ఉక్కుపాదం మోపుతున్నారని తెలిపారు . మద్యం దుష్ఫలితాలను ప్రజలకు వివరించడానికి మద్య విమోచన ప్రచార కమిటీ ఏర్పడి కృషి చేస్తుందన్నారు.

భవిష్యత్తులో ఇంజనీరింగ్ , మెడికల్ కళాశాలలో యూనివర్సిటీ ప్రాంగణాల్లో సాంస్కృతిక బృందాల ద్వారా కార్యక్రమాలను ఏర్పాటు చేసి యువతను జాగృతలను చేస్తామని తెలిపారు . స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో మద్యం అక్రమ రవాణా తయారీపై 1,20,822 కేసులు నమోదు చేసి 1,25,202 నిందితులను అరెస్టు చేశారని , 8,30,910 లీటర్ల అక్రమ మద్యాన్ని సీజ్ చేయడం 8,07,644 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవటం 2,30,48,401 లీటర్ల బెల్లం ఊట ను ధ్వంసం చేయడం , అక్రమ మద్యం రవాణా చేస్తున్న 29,491 వాహనాలు సీజ్ చేయడం జరిగిందన్నారు.గంజాయి సాగు రవాణాపై 220 కేసులు నమోదు చేసి 364 మంది నిందితులను అరెస్టు చేసి 18,686 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్ బ్యూరో ను మరింత బలోపేతం చేసి అక్రమదారులపై ఉక్కుపాదం మోపడానికి సిద్ధంగా ఉన్నామన్నారు . ఇటీవల మద్య విమోచన ప్రచార కమీటి రాష్ట్ర చైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి రాష్ట్ర డీజీపీ గౌతం సవాంగ్ వినతిపత్రం అందించగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర డీజీపీ గౌతమ్ సవాంగ్ తెలిపారన్నారు.మద్యం అక్రమాలపై , మత్తు పానీయాల పై 14500 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేస్తే సత్వర చర్యలు చేపడతామని వివరించారు . వేలాది సంవత్సరాలుగా కొనసాగుతున్న మద్యం వ్యసనాన్ని నిర్మూలించడానికి రాజకీయాలకు అతీతంగా అందరూ ఐక్యంగా కృషి చేయాలన్నారు .

ప్రజలను నిరంతరం జాగృతులను చేస్తూ మద్యం దుష్ఫలితాలను తెలియజేయడానికి మహిళా సంఘాలు , డ్వాక్రా మహిళలు , వాలంటీర్లు గ్రామ / వార్డ్ సచివాలయ సిబ్బంది తో సమిష్టి కృషి జరగాలన్నారు . రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన 15 డీ- అడిక్షన్ కేంద్రాలకు వ్యసనపరులను గుర్తించి వారికి ఉచితంగా లభించే చికిత్స సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు . ఈ సమావేశం లో స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్ బ్యూరో ( సెబ్ ) డిప్యూటీ కమిషనర్ బాల్టి రావు, మరియు అసిస్టెంట్ కమీషనర్ పి.రామచంద్రరావు ,అసిస్టెంట్ సూపరెండెంట్ "సబ్" (శ్రీనాధుడు, ఎన్ ఫోర్స్ మెంట్ ఇనస్పెక్టర్ కె. సురేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు .



# సాగర తీరంలో ఎస్పీ బాలు విగ్రహ ఏర్పాటుకు కృషి

**- మేయర్ గొలగాని హరివెంకట కుమారి**

- మాజీ డిప్యూటి మేయరు దాడి సత్యనారాయణ




విశాఖపట్నం : విశాఖ సాగర ప్రాంతంలో గాన గంధర్వుడు డా॥ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి హామీ ఇచ్చారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆర్కే బీచ్ రోడ్డులోని ఘంటసాల విగ్రహం వద్ద శనివారం ఉదయం సుప్రసిద్ధి సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రధమ వర్ధంతి ఘనంగా జరిగింది. ముఖ్య అతిధి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మాట్లాడుతూ 16 భారతీయ భాషా చిత్రాలలో 48 వేల పై చిలుకు వైవిధ్యభరితమైన గీతాలు ఆలపించి, రస హృదయాలలో చెరగని ముద్ర వేసిన బాలు కారణజన్ముడని కొనియాడారు. ఆయన గాన మాధుర్యానికి పరశించనివారుండరు అంటే అతిశయోక్తి లేదని మేయరు పేర్కొన్నారు. మాజీ డిప్యూటి మేయరు దాడి సత్యనారాయణ మాట్లాడుతూ తను డిప్యూటి మేయరుగా ఉన్నప్పుడు సాగరతీరంలో ప్రముఖుల విగ్రహాలు ఏర్పాటు చేసిన అవకాశం కలిగిందన్నారు.అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో వైకాపా నాయకులు గొలగాని శ్రీనివాసరావు, ఎల్.ఐ.సి. డి.ఓ.బొమ్మిడి సత్యన్నారాయణ, బాబా బజార్ అధినేత పెంట రవికుమార్, సినీ నిర్మాత పి.ఎన్. తిలక్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ వివిధ కళాసంఘాల ప్రతినిధులు షేక్ షకీల్, రాధారాణి, పల్లా వెంకటేష్ మాస్టర్, సి.హెచ్. సంగీతరావు, వారణాసి రాజేష్ తదితరులు బాలు ప్రజ్ఞాపాటవాలను కీర్తించారు.

# భారత్ బంద్‌కు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు



కృష్ణా జిల్లా: వ్యవసాయ చట్టాలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణలకు వ్యతిరేకంగా తలపెట్టిన భారత్ బంద్‌కు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బంద్‌లో భాగంగా 26వ తేదీ అర్ధరాత్రి నుంచి 27వ తేదీ 1 గంట వరకు ఆర్టీసీ బస్సులు నడవవు. ఆ తర్వాత నుండి బస్సులు యధావిధిగా తిరుగుతాయి. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని మంత్రి పేర్ని నాని తెలిపారు. రైతు సంఘాలు శాంతియుతంగా బంద్‌లో పాల్గొనాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయొద్దని, రైతు చట్టాలను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరుపున కేంద్రాన్ని కోరుతున్నాం' అని పేర్ని నాని విన్నవించారు.

# తుఫాన్ పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తం

శ్రీకాకుళం : వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లా యంత్రాంగం తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉందని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులను అప్రమత్తం చేశామని ఆయన పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ 08942 240557 ఏర్పాటు చేశామని, రెవెన్యూ డివిజనల్ అధికారుల కార్యాలయం, తాసిల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ కు ఏర్పాటు చేయాలని ఆదేశించామని అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన జారీ చేస్తూ అధికారులందరూ క్షేత్ర స్థాయిలో ఉండాలని, సెలవులను రద్దు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని ఆయన విజ్ఞప్తి చేశారు. మత్స్యశాఖ అధికారులు మత్స్యకారులు తీర గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని, ఎవరూ వేటకు వెళ్లకుండా చూడాలని ఆయన ఆదేశించారు. రైతులు తమ పంటలు నష్టపోకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తగిన సూచనలు సలహాలు అందించాలని ఆయన ఆదేశించారు. వరదలు వచ్చే ప్రాంతాలు, నీటమునిగే ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. అవసరం మేరకు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని కలెక్టర్ కోరారు. రెవెన్యూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. తుఫాను ప్రభావం అధికంగా ఉండి రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయిన సందర్భాల్లో రహదారులపై రాకపోకలకు ఇబ్బందులు ఎదురు కాకుండా వాటిని తక్షణం క్లియర్ చేయుటకు అన్ని పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలని రహదారులు భవనాల శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. విద్యుత్ అధికారులు సైతం విద్యుత్ స్తంబాలు, పరికరాలు, కూలీలను సిద్ధంగా ఉంచుకోవాలని, తక్షణం విద్యుత్తు పునరుద్ధరణకు అవసరమగు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయుట అవసరమగు భవనాలను సిద్దం చేయాలని తాసిల్దార్ లను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన ఆహారం అందించుటకు ఎం.ఎల్.ఎస్ పాయింట్ లో ఉన్న బియ్యం, ఇతర ఆహార ధాన్యాల నిల్వలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో చిన్నారులకు, వృద్ధులకు అవసరమగు పాలు, బిస్కెట్లు, రొట్టెలు తదితర ఆహార పదార్థాలు అందించుటకు అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# జిల్లాపరిషత్ చైర్‌పర్సన్, ఉపాధ్యక్షుడు, జడ్పీటీసీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసిన చొక్కాకుల





జిల్లా పరిషత్ ఎన్నికలలో విజయం సాధించి శనివారం విశాఖపట్నం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రమాణ స్వీకారోత్సవం చేసిన జిల్లాపరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు మరియు జడ్పీటిసీ సభ్యులకు ప్రభుత్వ విఫ్ బూడి ముత్యాలనాయుడు, అరకు శాసన సభ్యులు శెట్టి ఫాల్గుణ సమక్షంలో జిల్లా పరిషత్ అద్యక్షులు గా నియమితులైన జల్లిపల్లి సుబద్ర, ఉపాధ్యక్షులు తుమ్మపాల అప్పరావు, పరవాడ జడ్పీటిసీ పైల రాజు, కోటపాడు జడ్పీటిసీ ఈర్లె అనురాధ చీడికాడ జడ్పీటిసీ లాలం శారద వరలక్ష్మి, మాడుగుల జడ్పీటిసీ కిమిడి రమణమ్మ కి వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా బీసీ సెల్ నాయకులు కొటాన రాము, వైస్సార్సీపీ మాజీ సమన్వయకర్త బోకం శ్రీనివసరావు, అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, అంతకాపల్లి ఎంపిటీసీ చొక్కాకుల గోవింద తదితరులు పాల్గొన్నరు.





# MGF మేజర్ డోనర్స్, ప్రతి క్లబ్ నుండి ఎంపిక చేసి వాకర్స్ ఇంటర్నేషనల్ ను బలోపేతం చేస్తా..




## - 2022 రిజియన్ కౌన్సిలర్ నెంబర్ -5 గా పిళ్ళా అర్జునుడు ఏకగ్రీవంగా ఎంపిక
## - ఘనంగా సత్కరించిన ఏయూ మాస్టార్స్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

*విశాఖపట్నం లోని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 101 వాకర్స్ క్లబ్‌లలో పరిచయం లేని పేరు ఉత్తమ కార్మిక ఉపాధ్యాయులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత పిళ్ళా అర్జునుడు. జిల్లాలో ఉన్న అన్ని వాకర్స్ క్లబ్‌లను ఒకే తాటిపై నడిపించి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలనే సంకల్పంతో ప్రతినిత్యం వాకర్స్ క్లబ్బుల సభ్యులకు తన సూచనలు, సలహాలు అందిస్తున్న పిళ్ళా అర్జునుడు గారికి 2022 రీజియన్ కౌన్సిలర్ నెంబర్ 5 ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల ఏయూ మాస్టర్స్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఘన సన్మానం చేశారు. అలాగే పలు వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు అభినందనలు తెలియజేయడం అభినందనీయం.*



**వాకర్ పి.అర్జునుడు, ఎం.జి.ఎఫ్,**

- ఉత్తమ కార్మిక ఉపాధాయులు, (రాష్ట్రపతి అవార్డు గ్రహీత)
- వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 101, గవర్నర్ - 2020
- వాకర్స్ ఇంటర్నేషనల్ 2022 రిజియన్ కౌన్సిలర్ నెంబర్ - 5 ఏకగ్రీవంగా ఎన్నిక



పిళ్ళా అర్జునుడు గారికి ఏయూ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలియజేస్తున్న దృశ్యం



**విశాఖపట్నం** : వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 101 డిస్ట్రిక్ట్ గవర్నర్ 2020 లో ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డ మరియు, 2021 సంవత్సరం ఏరియా కో-ఆర్డినేటర్ డిస్ట్రిక్ట్ 101 గా విధులు నిర్వహించిన ఎంజీఎఫ్ రాష్ట్రపతి అవార్డు గ్రహీత పిళ్ళా అర్జునుడు గారికి 2022 రీజియన్ కౌన్సిలర్ నెంబర్ -5 ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల ఏయూ మాస్టర్స్ వాకర్స్ క్లబ్ ప్రెసిడెంటు ప్రొఫెసర్ నరసింహారావు, వాకర్స్ డి.పోలరావు, బి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏయూ ఇంజనీరింగ్ గ్రౌండ్ ప్రాంగణంలో వాకర్స్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా 2022 రీజియన్ కౌన్సిలర్ నెంబర్ 5 ఏకగ్రీవంగా నియమితులైన రాష్ట్రపతి అవార్డు గ్రహీత పిళ్ళా అర్జునుడు మాట్లాడుతూ వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 101 డిస్ట్రిక్ట్ గవర్నర్ గా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డానని, అనంతరం 2021 సంవత్సరం వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 101 ఏరియా కోఆర్డినేటర్ గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి వాకర్స్ క్లబ్ ల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని తెలియజేశారు. సెప్టెంబర్ 3వ వారంలో 2022 రీజియన్ కౌన్సిలర్ నెంబర్ 5 ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గతంలో వాకర్ సెంటర్ నేషనల్ రూరల్ మరియు అర్బన్ గా విభజించి ఉండేవని ప్రస్తుతం 2022 కు గాను మొట్టమొదటి సారి రూరల్ అర్బన్ లో కలిసి రీజియన్ కౌన్సిలర్ నెంబర్ 5 ఏకగ్రీవం చేయడం జరిగిందన్నారు.

- **సుమారు 130 వాకర్స్ క్లబ్ లు రీజియన్ కౌన్సిలర్ నెంబర్ 5 అండర్ లో ఉంటాయని తెలియజేశారు.**
- **జిల్లాలో కొన్ని కారణాల వలన మూతపడిన వాకర్స్ క్లబ్ లో మరలా పునఃప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తామన్నారు.**
- **సభ్యుల సహకారంతో మిషన్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టును అమలు పరిచేందుకు ప్రయత్నాలు చేస్తామన్నారు.**
- **రీజియన్ కౌన్సిలర్ నెంబర్ 5 అండర్ లో ఉన్న క్లబ్‌లు అన్నియు సమాజానికి అవసరమైన సేవలను అందించుటకు తన వంతు ప్రోత్సాహం, సహాయ సహకారాలు అందిస్తామన్నారు.**
- **2022 వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ గారు తీసుకున్న నిర్ణయాలన్నీ జిల్లాలో ఉన్న క్లబ్ అధ్యక్షులకు కార్యవర్గానికి తెలియపరిచి అమలు పరిచేందుకు కృషి చేస్తానని అన్నారు.**
- **అలాగే 2022 డిస్టిక్ 101 గవర్నర్ కు చేదోడు వాదోడుగా ఉండి నిరంతరమూ సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు.**
- **ఎంజిఎఫ్ మేజర్ డోనర్స్ ప్రతి క్లబ్బు నుండి ఎంపిక చేసి వాకర్స్ ఇంటర్నేషనల్ ను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.**







**వాకర్ పిళ్ళా అర్జునుడు కి సన్మానిస్తున్న ఏయూ వాకర్స్ క్లబ్ ప్రతినిధుల దృశ్య మాలిక**









*2022 రీజియన్ కౌన్సిలర్ నెంబర్ 5 ఏకగ్రీవంగా ఎన్నికైన పిళ్ళా అర్జునుడు ను ఇటీవల త్రీ స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు వి.నూకరాజు (ఎంజిఎఫ్) మరియు కార్యవర్గం ఘనంగా సన్మానించారు.*

## నేడు త్రీ స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్

నగరంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో వాకర్స్ కు, వాకర్స్ కుటుంబ సభ్యులకు ఉచిత మెడికల్ క్యాంపు స్థానిక కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ శారదా బేకరీ దగ్గర త్రీ స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు 2022 రీజియన్ కౌన్సిలర్ నెంబర్ 5 ఏకగ్రీవంగా ఎన్నికైన పిళ్ళా అర్జునుడు తెలియజేశారు. ఈ మెడికల్ క్యాంపు లో సంబంధిత వైద్యులు వచ్చి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసి ఆరోగ్యం పట్ల పలు సలహాలు సూచనలు చేస్తారని తెలియజేశారు. కావున వాకర్స్ క్లబ్ ప్రతినిధులు, స్థానిక వాకర్స్ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

**మనిషికి డబ్బు ఇచ్చే ధైర్యం కంటే మనిషికి మనిషి ఇచ్చే నమ్మకం చాలా గొప్పది**

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com